ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:26 (బుధ)
సహరి : 4:35 (గురు)

5న చంద్రబాబు ప్రజాగళం

తరలి రావాలని ఎమ్మెల్యే నిమ్మల పిలుపు

పాలకొల్లు టౌన్/నరసాపురం, ఏప్రిల్ 2 : టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 5, 6 తేదీల్లో నరసాపురం, పాలకొల్లు నియోజక వర్గాల్లో పర్యటించనున్నారు. ముందుగా ప్రకటించిన విధంగా తణుకు పర్యటన రద్దు కాగా ఆ స్థానంలో నరసాపురంలో పర్యటిస్తారు. పాలకొల్లులో 5న ప్రజాగళం బహిరంగ సభను విజయవంతం చేద్దామని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. లయన్స్ కమ్యూనిటీ హాలులో మంగళవారం సాయంత్రం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ముఖ్యనాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాగళం సభను విజయవంతం చేయడంలో కూటమి నాయకులంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రకాలుగా దివాలా తీసిందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం ప్రతీ కార్యకర్త ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ఐదో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు హెలీకాప్టర్‌లో నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో దిగుతారని నరసాపురం టీడీపీ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు చెప్పారు. అక్కడి నుంచి పట్టణంలోని మెయిన్‌రోడ్ వరకు రోడ్ షో నిర్వహించి బహిరంగ సభలో మాట్లాడతారని చెప్పారు. సభ అనంతరం పాలకొల్లు వరకు రోడ్ షో నిర్వహిస్తారని తెలిపారు.

'ప్రేరణ' పోటీలు వాయిదా

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 : స్కూలు విద్యార్థులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఈనెల 4న నిర్వహించాల్సిన 'ప్రేరణ' జిల్లాస్థాయి పోటీలను రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశామని ఎస్ఎస్ఏ అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ రెడ్డి రామారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి ఈ పోటీలను ఎప్పుడు నిర్వహించేదీ తెలియజేస్తామన్నారు.

దూరవిద్య ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 32మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 : ఏపీ ఓపెన్‌స్కూల్స్ దూరవిద్య ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన ఫిజిక్స్ పరీక్షకు జిల్లాలో 28మంది, కెమిస్ట్రీ పరీక్షకు 46, బయోలాజికల్ సైన్స్ పరీక్షకు 39మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 32మంది గైర్హాజరయ్యారని జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదన్నారు.

ఎన్నికల ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

ఏలూరుసిటీ, ఏప్రిల్ 2: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జిల్లాలో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను పరిశీలించేందుకు మంగళవారం స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్‌మోహన్‌మిశ్రా ఏలూరు విచ్చేశారు. తొలుత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను ఆయన సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాలో ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరును ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ వై. ప్రసన్నవెంకటేశ్ సంబంధించిన వివరాలను తెలియజేస్తూ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలు, ఫిర్యాదులకు సంబంధించిన వివరాలు కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, సంబంధిత రిటర్నింగ్ అధికారులకు చేరవేయబడుతుందని పిమ్మట అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. అనంతరం సి-విజిల్ పర్యవేక్షక విభాగాన్ని పరిశీలించారు. ఎన్నికల కమిషన్‌కు రోజువారీ నివేదికలు పంపే విభాగాన్ని సందర్శించారు. జిల్లాలో ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లను కలెక్టర్‌తోపాటు, జిల్లా ఎస్పీ మేరీప్రశాంతి ఆయనకు వివరించారు. తొలుత జిల్లాలో జరుగుతున్న స్వీప్ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పెన్షన్.. టెన్షన్

పింఛనుదారులతో వైసీపీ రాజకీయ చెలగాటం

తిరిగి విపక్షాలపై కౌంటర్ ఎటాక్

- లక్షలాది మంది వృద్ధుల్లో గందరగోళం
- రోగులు, కదల్లేని వృద్ధులకు ఇంటికే పింఛన్
- నేటి నుంచి ఆరో తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పంపిణీ
- ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు అందజేత



కలెక్టరేట్ వద్ద వినతిపత్రాలు చూపిస్తున్న గన్ని, బడేటి, చింతలపూడిలో వినతిపత్రం అందిస్తున్న సొంగా రోషన్‌కుమార్, టీడీపీ నేతలు

వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు మొదలైన వారికి ప్రతీ నెల ఒకటో తేదీన పంపిణీ చేసే పింఛన్‌లలో రెండు రోజులుగా రాజకీయ రాద్ధాంతం కొనసాగుతోంది. ఓట్ల వేటలో ప్రతిపక్షాలను ఇరుకున పెట్టి, పేదల మనస్సుల్లో అనుమాన బీజాలు నాటేందుకు ప్రయత్నించింది. వలంటీర్లలో కొందరు పరోక్షంగా వైసీపీ పథకాలన్నీ ఇళ్లకు చేరుస్తుండగా.. టీడీపీ అడ్డుకోవడం వల్లే మీకు పింఛన్ ఇవ్వలేకపోతున్నామని నిరక్షరాశ్యులు చెవిలో ఊదేందుకు ప్రయత్నించారు. తమ పార్టీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని టీడీపీ తిప్పికొట్టింది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, మహిళలందరికి ఇంటింటికి వెళ్ళి పింఛన్ అందించాల్సిందేనని గట్టిగానే కోరింది. అధికారులకు విజ్ఞాపనలు అందించింది.

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

వృద్ధులతోపాటు అర్హులకు అందాల్సిన పింఛన్ ఏప్రిల్ నెల ప్రారంభమైన రెండు రోజులకు అందలేదు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబాలకు అందాల్సిన పింఛన్‌దీ అదే పరిస్థితి. ఆ స్థానంలో జరిగిన జాప్యానికి మసిపూసి మారేడు కాయ చేసేందుకు రెండు రోజులుగా అధికార వైసీపీ విపరీత పోకడలకు దిగింది. పింఛన్‌దారుల మదిలో విషం పూసేందుకు ప్రయత్నించింది. దీన్ని సాకుగా చూపెట్టి ప్రతిపక్షాలను టార్గెట్ చేసింది. సచివాలయాల వద్ద మూడు నుంచి ఆరో తేదీ వరకు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు పింఛన్ల అందించేలా చర్యలు చేపట్టింది.

టీడీపీ మాత్రం తక్షణం పింఛన్ దారులు అందరికి ఇంటింటికి వెళ్లి నగదు అందించేలా చూడాల్సిందేనని, ఈ విషయంలో లోపాలు దొర్లకూడదని నియోజకవర్గాల వారీగా అధికారులకు విజ్ఞాపనలు అందజేసింది.

వైసీపీ కావాలనే వక్రీకరణ..

వలంటీర్లు కొందరు అధికార వైసీపీ కార్యకర్తలుగా మారి రాజకీయ పన్నాగాల్లో భాగస్వాములు అవుతుండడంతో వీరిపై ఎన్నికల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పింఛన్ పంపిణీ బాధ్యతను వలంటీర్ల నుంచి తొలగించాల్సిందిగా ఆదేశించింది. ఈ ఆదేశాల క్రమంలోనే వలంటీర్ల నుంచి ఈ బాధ్యతలు తప్పించటమే కాకుండా వారు వాడుతున్న మొబైల్స్‌ను అధికారులు స్వాధీన పరుచుకున్నారు. వాస్తవానికి ఇదంతా జరగ్గా ఎన్నికల కమిషన్‌ను పక్కనపెట్టి ఈ తతంగం అంతా తెలుగుదేశమే చేస్తుందంటూ వైసీపీ ఇష్టానుసారం ప్రచారానికి దిగిందని టీడీపీ ఆరోపిస్తోంది. ఇప్పటికే జాబితాలో ఉన్న వారందరికి పింఛన్లు యథావిధిగా అందించలేక చతికిలపడిన వైసీపీ కావాలనే వక్రీకరించి దీన్ని తమపై నెడుతున్నారని టీడీపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రత్యేకించి పింఛన్‌దారుల్లో వున్న గందరగోళాన్ని తక్షణం నివారించాలని ఆ మేరకు సచివాలయ సిబ్బందిని రంగంలోకి దించాలని అభ్యర్థించారు. వాస్తవానికి పింఛన్ పంపిణీలో ఇంతకు ముందు ఉన్న గందరగోళ పరిస్థితినే మంగళవారం కొంత కొనసాగింది.

ఏలూరు జిల్లాలో పింఛన్‌దారులు 2,81,470 మంది ఉండగా వీరికి రూ.81 కోట్ల 17 లక్షలు ప్రతినెల ఇప్పటివరకు అందజేస్తూ వచ్చారు. నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలో 2,36,722 మంది పింఛన్‌దారులకు గాను రూ.69 కోట్ల 74 లక్షలు ప్రతినెల కేటాయిస్తున్నారు. ఇప్పుడు ఈ మొత్తాన్ని బుధవారం బ్యాంకుల నుంచి విడుదల చేసి అందించేందుకు చర్యలు ఆరంభించేలా సూచనలు అందాయి. ఇప్పటికే మంచం పట్టిన రోగులు, కదల్లేని వృద్ధులకు మాత్రం ఇళ్లకు వెళ్ళి పింఛన్ అందించాలని కీలక నిర్ణయానికి వచ్చారు. మిగతా వారందరికి ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు సచివాలయాల వద్దే పింఛన్ అందుకునే అవకాశాన్ని ఇచ్చారు. ఈ విషయాన్ని సచివాలయ సిబ్బంది అంతా అందరికి సమాచారం అందించాలని సూచించారు. ఎక్కడ సచివాలయ పరిధిలో నివాసం ఉంటున్నారో వారంతా ఆయా సచివాలయాలకు వెళ్ళి పింఛన్ అందుకోవచ్చని మంగళవారం రాత్రి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఇప్పటి వరకు పింఛన్ల పంపిణీ సాఫీగా జరిగింది కాబట్టి వలంటీర్లు లేకుండా పింఛన్ అందుకోవడానికి ఎన్ని ఇబ్బందులు పడ్డామో ప్రజలకు తెలియాలని అధికార పార్టీ ఇప్పటికే ఆశిస్తోంది. వీలైనచోటల్లా ప్రజలకు, వలంటీర్ల వ్యవస్థపై నేరుగా గొప్పలు చెప్పడం, వీరంతా తెలుగుదేశం కారణంగానే మండుటెండల్లో పింఛన్ తీసుకునే పరిస్థితులు వచ్చాయని బురదచల్లేందుకు పన్నాగులు పన్నుతున్నారంటూ టీడీపీ ఆగ్రహంతో ఉంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు టీడీపీ కూడా పింఛన్‌దారులకు సక్రమంగా సొమ్ము చేతికి అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని భావిస్తోంది. వీలైనంత మేరకు తాజా పరిస్థితిని పర్యవేక్షించాలని భావిస్తోంది.

శివారు గ్రామాల సంగతేమిటి ?

ముదినేపల్లి, ఏప్రిల్ 2 : దివ్యాంగులు, అస్వస్థతకు గురైన వారు, వితంతువులకు ఇంటి వద్ద పెన్షన్లు ఇవ్వడం వరకు ఓకే. మరి సచివాలయాలకు కిలోమీటర్ల దూరంలో వున్న పింఛనర్ల పరిస్థితి ఏమిటి ? ముదినేపల్లి మండలంలోని చాలా గ్రామాల వారు వేసవిలో ఇబ్బందులు తప్పవు. వీరికి కూడా సచివాలయ సిబ్బంది అందజేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. పెదగొన్నూరు సచివాలయానికి మూడు కిలోమీటర్ల దూరంలోని శివారు గ్రామాలైన ఉప్పరగూడెం, కర్షక హరిజనవాడ, విశ్వనాద్రిపాలెం వాసులు వెళ్లి పింఛన్ తీసుకోవాలి. శ్రీహరిపురం సచివాలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని కోమర్రు, చినకోమర్రు, రెండు కిలోమీటర్ల దూరంలోని కాకరవాడ గ్రామాల పెన్షనర్లు వెళ్లి తెచ్చుకోవాలి. సింగరాయపాలెం సచివాలయానికి రెండు కిలోమీటర్ల దూరం నుంచి చేవూరు పెన్షనర్లు, - బొమ్మినంపాడు సచివాలయానికి రామచంద్రపురం, సూర్యనారాయణపురం, పాత హరిజనవాడ, జానకిగూడెం, కొత్త హరిజనవాడ, గొల్లగూడెం పెన్షనర్లు, - ములకలపల్లి పంచాయతీ పెన్షనర్లు రెండు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం రావాల్సి ఉంది. ఇలా మరికొన్ని గ్రామాల పింఛనర్లు ఉన్నారు. తమ ఇళ్లకు సచివాలయాల సిబ్బందిని పంపించి పింఛను అందించాలని పలువురు వృద్ధులు కోరుతున్నారు.

పింఛన్లు పంపిణీ చేయండి

» కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 2 : భారత ఎన్నికల సంఘం ఆదేశాలను పాటిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు బుధవారం నుంచి ఆరో తేదీవరకు ప్రతి రోజు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వై.ప్రసన్నవెంకటేశ్ అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, తీవ్రమైన అనారోగ్యం, వీల్ చైర్‌కు పరిమితమైన వారికి ఇంటివద్దే పింఛన్లను పంపిణీ చేయడంతో పాటు మిగిలిన వారికి సమీపంలోని సచివాలయాల ద్వారా అందించాలన్నారు. పెన్షన్ల పంపిణీపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలను జారీ చేశారన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలను తు.చ తప్పకుండా పాటించి విమర్శలకు తావు లేకుండా పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేలా పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఆర్. విజయరాజును కలెక్టర్ ఆదేశించారు.

జగన్ స్వార్థ రాజకీయానికి పెన్షనర్లు, వలంటీర్లకు నష్టం : పితాని



పోడూరు, ఏప్రిల్ 2 : జగన్ స్వార్థ రాజకీయానికి పింఛనుదారులు, వలంటీర్లు నష్టపోతున్నారని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పోడూరు మండలం కొమ్ముచిక్కాలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఖజానాలో ఉన్న సొమ్ములన్నీ జగన్ ఇష్టానుసారంగా కాంట్రాక్టర్లకు చెల్లించి, నిధులు కొరత పెట్టి పింఛన్‌దారులకు చెల్లించేందుకు లేకుండా చేశారన్నారు. నిధుల కొరత వల్ల పింఛన్లను ఏప్రిల్ 1న పంపిణీ చేయలేమని ఆలస్యం అవుతుందని అధికారులు ప్రకటిస్తే దీన్ని జగన్, వైసీపీ నాయకులు రాజకీయ రంగు పులిమి ఎన్నికల కమిషన్, చంద్రబాబు వల్లే పింఛన్లు నిలిచిపోయాయంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.

ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలి

సచివాలయ ఉద్యోగులచే ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలి. వలంటీర్లకు బదులుగా పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. పింఛన్ల పంపిణీ వైసీపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే దురుద్దేశపూర్వకంగా వ్యవహరిస్తుంది. వలంటీర్లు ఎన్నికల కోడ్ యథేచ్ఛగా ఉల్లంఘించి వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఓటర్లను ప్రలోభ పెడుతున్నారు.

- గన్ని వీరాంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు
- బడేటి చంటి, టీడీపీ ఏలూరు కూటమి అభ్యర్థి

నిధులు లేకే వైసీపీ ప్రభుత్వ దుష్ప్రచారం

ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నందున వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పింఛన్‌దారులకు సచివాలయ సిబ్బంది నేరుగా ఇంటివద్దకే వెళ్లి సొమ్ములు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో ఉన్న సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శుల సేవలను వినియోగించుకుని అందించేలా చర్యలు తీసుకోవాలి. వైసీపీ ప్రభుత్వం పింఛన్ల పంపిణీకి టీడీపీ అడ్డుపడుతోందని దుష్ప్రచారం చేస్తోంది. వైసీపీ ప్రభుత్వం వద్ద నిధులు లేక ఇటువంటి సాకులు చెబుతోంది.

- సొంగా రోషన్‌కుమార్
టీడీపీ చింతలపూడి కూటమి అభ్యర్థి

పింఛన్లు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్రం



జగన్‌పాలనలో రాష్ట్రం సర్వనాశనమైంది. అప్పులు తెచ్చి సంక్షేమ కార్యక్రమాలు చేయడం తప్ప రాష్ట్రాభివృద్ధికి కావాల్సిన చర్యలు తీసుకోవడంతో జగన్ పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల బడ్జెట్ పెరగకపోవడంతో రాష్ట్రం దివాళా తీసింది. ఇప్పుడు పింఛన్లు సైతం ఇవ్వలేని దుస్థితికి రాష్ట్రం దిగజారింది. పింఛన్ల పంపిణీకి టీడీపీ అడ్డుపడుతోందని వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. ఇంకా పెన్షన్లు అందకపోవడానికి ప్రధాన కారణం ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోవడమే.

- కొల్లు పార్థసారథి
టీడీపీ నూజివీడు కూటమి అభ్యర్థి

వలంటీరు తొలగింపు

పెదవేగి, ఏప్రిల్ 2:పింఛన్ల పంపిణీ ఆలస్యం కావడానికి చంద్రబాబునాయుడు కారణమని, ఈ విషయాన్ని వలంటీర్లంతా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన పెదవేగి గ్రామం 8వ క్లస్టర్ వలంటీరు పిల్లా రాజ్యలక్ష్మిని తొలగిస్తూ ఎంపీడీవో వెంకటరమణ ఉత్తర్వులు జారీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టుల వివరాలతో టీడీపీ నాయకులు జిల్లా సంయుక్త కలెక్టర్ బి.లావణ్యవేణికి ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం మంగళవారం ఉత్తర్వులు అందించారు.

మహిళలకు తెలియకుండానే రుణాలు

దువ్వలో డ్వాక్రా సభ్యుల సొమ్ము కాజేసిన సీఏ


బ్యాంకులో డ్వాక్రా మహిళలతో ఆరిమిల్లి

» బ్యాంకు వద్ద ఆరిమిల్లి సహా బాధితుల ధర్నా

తణుకు, ఏప్రిల్ 2 : తణుకు మండలం దువ్వ డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలకు తెలియకుండా వారి పేరు మీద రుణాలు తీసుకొని సొమ్ము కాజేసిన సీఏ భాగ్యలక్ష్మి భాగోతం వెలుగుచూసింది. మంగళవారం పలువురు డ్వాక్రా మహిళలు దువ్వ యూనియన్ బ్యాంకు వద్ద పలు సంఘాల బాధిత మహిళలు ఆందోళనకు దిగారు. క్లస్టర్ ఏజెంట్(సీఏ) భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో 45 డ్వాక్రా సంఘాలున్నాయి. ఒక్కో గ్రూపులో పది మంది మహిళలు ఉన్నారు. ఈ సంఘాల రుణాలు, పొదుపు చెల్లింపులు తానే చూస్తుంది. సభ్యులకు తెలియకుండా వీరి గ్రూపు రుణాలు, సీసీఎల్ రుణాల పేరుతో భారీగా అక్రమాలకు పాల్పడింది. ఒక్కో గ్రూపులోని ఇద్దరేసి సభ్యుల పేర వారికి తెలియకుండానే బ్యాంకులో వ్యక్తిగత రుణాలు తీసుకునేది. ఈ సొమ్ము ఈ సభ్యుల ఖాతాలో పడ గానే.. పొరపాటున వేరే ఖాతాలో పడాల్సిన సొమ్ము మీ అకౌంట్‌లో పడిందని చెప్పి.. ఆ మొత్తాన్ని తన ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయించుకునేది. బాగా తెలిసిన వ్యక్తి కావడం.. అందరికీ తలలో నాలుకలా ఉండడంతో ఆమెను అంతా నమ్మారు. కొంత కాలంగా తన స్వలాభం కోసం రుణాలు పెట్టుకుంటూ అక్రమాలకు పాల్పడింది. కొంత కాలంగా బ్యాంకు ఖాతా పుస్తకాలు ప్రింటింగ్ చేయకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఆయా అకౌంట్‌లలో నగదు విత్ డ్రా చేసింది. పాస్ బుక్‌ల్లో కొంత కాలంగా ప్రింటింగ్ చేయకపోవడంతో సిబ్బందిని మహిళలు ప్రశ్నించారు. దీంతో ప్రింట్ చేయడంతో అకౌంట్‌ల నుంచి భారీ స్థాయిలో నగదు విత్ డ్రాల విషయం బయటపడింది. దీనిపై సీఏ భాగ్యలక్ష్మిని మహిళలు నిలదీయడంతో విషయం గ్రామ పెద్దల వరకు వెళ్లింది. గ్రూపు సభ్యుల నుంచి తానే నగదు తీసుకున్నట్లు ఆమె ఒప్పుకుంది. ఒక్కో ఖాతా నుంచి ఆమె లక్ష నుంచి రెండు లక్షల వరకు విత్ డ్రా చేసినట్లు చెబుతున్నారు. ఈ మొత్తం సుమారు రూ.40 లక్షలు పైమాటేనంటున్నారు.

అన్ని ఖాతాలు తనిఖీ చేయాలి : ఆరిమిల్లి

ఈ విషయం ఎంతకూ తేలకపోవడంతో బాధితులంతా మంగళవారం బ్యాంకును ముట్టడించారు. వీరికి మద్దతుగా తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అక్రమాలు జరిగిన ఈ 45 బ్యాంకు ఖాతాలను తనిఖీ చేయాలి. ఐదేళ్లుగా దువ్వలో ఎంత దోపిడి జరిగిందో తెలుసుకోవాలి. రుణాలు తీసుకున్న వారే తిరిగి చెల్లించాలి. దీని వెనుక ఎవరు ఉన్నారో గుర్తించాలి. మహిళలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం. రుణాలు, వాయిదాల చెల్లింపుల విషయంలో మినహాయింపు ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. డ్వాక్రా సంఘాల సొమ్ము కాజేసిన ఘటనపై దర్యాప్తు చేయాలని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు అధికారులను కోరారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ప్రతి పైసా తిరిగి మహిళల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు.

ఆర్టీసీ కార్గోలో అవినీతి రవాణా !


ఆర్టీసీ కార్గో కార్యాలయం

నరసాపురం, ఏప్రిల్ 2 : నరసాపురం ఆర్టీసీ కార్గోలో సొమ్ములు గోల్‌మాల్ అయ్యాయి. పార్శిల్ బుకింగ్ సొమ్మును ఎప్పటికప్పుడు సంస్థకు జమ చేయకపోవడంతో ఈ బాగోతం బయటపడింది. పది రోజుల నుంచి ఆర్టీసీ ఆడిట్ అధికారులు రికార్డులను పరిశీలిస్తున్నారు. మరోవైపు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. ఏటా ఆర్టీసీ డిపోల వారిగా ఆడిట్ నిర్వహించడం పరిపాటి. ఈ క్రమంలో కార్గో వాహనాలకు ఆదాయంకంటే ఆయిల్ ఖర్చే ఎక్కువ కనిపించింది. దీంతో అనుమానం వచ్చిన ఆడిట్ సిబ్బంది రికార్డులను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఈ భాగోతం కూడా బయటపడింది. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వారి ఆదేశాలతో ఆర్టీసీ ఆడిట్ అధికారి కాశీం రికార్డులను పరిశీలిస్తున్నారు. ఇందులో పార్శిల్ బుకింగ్ అయిన వెంటనే ఆ సొమ్మును రికార్డులో నమోదు చేయలేదు. రెండు, మూడు రోజులకు ఒకసారి జమ చూపించారు. కొన్ని రశీదులు వారం తర్వాత చూపించారు. ఇప్పటి వరకు జరిపిన ఆడిట్‌లో లక్షల్లో తేడా కనిపించింది. ఇలా ఎన్ని ఏళ్లుగా జరిగిందన్న దానిపై రికార్డులను పరిశీలిస్తున్నారు. ఇందులో ఎవరెవరి పాత్ర ఉందన్న దానిపై ఆరా తీస్తున్నారు. దీనిపై డీఎం సుబ్బన్నరెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పార్శిల్స్‌కు సంబంధించిన సొమ్ములు ఏ రోజుకారోజు జమ కాలేదన్న విషయం ఆడిట్‌లో బయటపడిందన్నారు. దీనిపై రికార్డులను పరిశీలిస్తున్నారు. ఎన్ని రోజులకు ఒకసారి జమ చేశారు. నిధులు ఏమైనా పక్కదారి పట్టాయా ? అన్న పూర్తిగా ఆడిట్ జరగాల్సి ఉందన్నారు.


పోలీస్ కవాతులో పాల్గొన్న కలెక్టర్, జేసీ, ఎస్పీ తదితరులు

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలి

» కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు క్రైం/ఏలూరు సిటీ, ఏప్రిల్ 2 : రానున్న ఎన్నికల్లో జిల్లా ప్రజలు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి పోలీస్ సిబ్బంది, సాయుధ దళాల సిబ్బందితో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో ఆయనతో పాటు ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, జేసీ బి.లావణ్యవేణి తదితరలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి జిల్లాలో పోలీస్, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖల ఆధ్వర్యంలో చెక్ పోస్టుల వద్ద స్టాటిక్ సర్వేలైన్సు టీమ్ (ఎస్ఎస్‌టీ), ఫ్లయింగ్ సర్వేలైన్స్ టీమ్‌లు (ఎఫ్ఎస్‌టీ), వీడియో నిఘా బృందాలు (వీఎస్‌టీ) ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నా మన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఎనిమిది వేల నుంచి పది వేల వరకు పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. దీనిలో కేంద్ర బలగాలు (సీఐఆర్ఎఫ్) 3 బృందాలు జిల్లాకు కేటాయించారని, అందులో రెండు బృందాలు ప్రస్తుతం జిల్లా అంతటా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని మంగళవారం ఏలూరు నగరంలో నిర్వహించామన్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా జిల్లా పోలీస్ యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి, ఏలూరు రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్. వెంకటకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు వన్‌టౌన్, టూటౌన్, నాలుగో టౌన్ ఇన్‌స్పెక్టర్‌లు రాజశేఖర్, ప్రభాకర్‌రావు, వి.వెంకటేశ్వరరావు, ఆర్ఐ పవన్‌కుమార్, ఎస్ఐ.లక్ష్మణబాబు, సాధిక్, ప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి పాల్గొన్నారు.

ఎన్నికల సమాచారానికి 94910 41435

త్వరలో జరగబోయే ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి వై.ప్రసన్నవెంకటేశ్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్యల కోసం వాట్సాప్ మెస్సేజ్/ ఫొటోల ద్వారా వాస్తవ సమాచారం ప్రజలు అధికార యంత్రాంగానికి అందిచాలని కోరారు. వాట్సాప్ నంబరు 94910 41435 అందుబాటులో ఉంచామన్నారు.

443 అభ్యర్థనలకు అనుమతులు జారీ

ఏలూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 2: జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా అందిన అభ్యర్థనలలో ఇంతవరకు 443 అనుమతులు ఇచ్చినట్టు ఏలూరు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా 705 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకు 443 అనుమతులు జారీచేయగా మరో 17 పరిశీలనలో ఉండగా 245 తిరస్కరించామన్నారు. సి-విజిల్ ద్వారా 214 ఫిర్యాదులు అందగా వాటిలో 121 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 71 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ. 133.68 లక్షలు విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామన్నారు. వీటిలో రూ. 47.54 లక్షలు నగదు కాగా, రూ.81.75 లక్షలు విలువైన మద్యం, రూ. 3.86 లక్షలు ఇతరాలు ఉన్నాయన్నారు.



నాచుగుంట , భువ్వనపల్లిలో తనిఖీలు

రూ.13,27,700 నగదు స్వాధీనం

ఉంగుటూరు /నిడమర్రు /కలిదిండి ఏప్రిల్ 2 : ఉంగుటూరు మండలం నాచుగుంట వద్ద జాతీయ రహదారిపై మంగళవారం తనిఖీల్లో రూ.6.96 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిడమర్రు సీఐ మోగంటి వెంకట సుభాష్ ఆధ్వర్యంలో చేబ్రోలు ఎసై మణి కుమార్ ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం తనిఖీలు చేస్తుండగా విశాఖ నుంచి నెల్లూరు జిల్లా సంఘంకు వెళుతున్న కారులో మునగాల కోటేశ్వరరావు తీసుకు వెళుతున్న నగ దుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఉంగుటూరు టోల్‌గేట్ సమీపంలో రూ.లక్షా 27 వేల 700 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిడమర్రు మండలం భువ్వనపల్లిలో ఎఫ్ఎస్‌టీ ఇన్‌చార్జి షేక్ హబీబ్ భాషా నేతృత్వంలో వాహన తనిఖీలు చేస్తుండగా తాడేపల్లిగూడెం నుంచి కాళ్ళ వెళ్తన్న కారు తనిఖీ చేయగా కామిశెట్టి సత్యదుర్గాదాస్ ఎటువంటి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో రూ.75 వేలు నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నిడమర్రు ఎస్ఐ శ్రీను, మనోహర్, దుర్గారావు, జ్యోతి పాల్గొన్నారు. కలిదిండి మండలం మద్వానిగూడెం చెక్ పోస్టు వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేస్తుండగా కలిదిండికి చెందిన గంపా రాజేష్ బుల్లెట్‌పై మంగళవారం రాత్రి రూ.3,59,960, కోరుకొల్లుకు చెందిన చావాకుల వెంకట రాజేష్ కారులో రూ.78,500 నగదును తగిన ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.



జి.కొత్తపల్లిలో సారా స్వాధీనం...నాగిరెడ్డిగూడెంలో బెల్లపు ఊట ధ్వంసం

215 లీటర్ల సారా సీజ్..
4,450 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చింతలపూడి /ద్వారకా తిరుమల : చింతలపూడి ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో ఏఈఎస్ గణపతిబాబు ఆధ్వర్యంలో సారాపై దాడులు జరిపి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చింతలపూడి సీఐ ప్రసాద్ తెలిపారు. సర్కిల్ పరిధిలోని రాగిరెడ్డిగూడెం, లింగపాలెం, వేములపల్లి, కల్లచెరువు గ్రామాల్లో దాడులు జరిపి 3,650 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 65 లీటర్ల నాటుసారా సీజ్ చేశారు. అనంతరం అల్లిపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు జరిపారు. దాడుల్లో గణపతిబాబుతో పాటు చింతలపూడి సీఐ ప్రసాద్, ఏలూరు డీపీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఎస్సైలు లక్ష్మణరావు, మోహన్‌రావు, నరసింహారావు సిబ్బంది పాల్గొన్నారు. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో మంగళవారం భీమడోలు సీఐ రవి కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి సారా కాస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపు లోకి తీసుకుని వారి నుంచి 150 లీటర్ల సారా, 800 లీటర్ల బెల్లం ఊట స్వాధీనం చేసుకున్నట్లు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఎస్.శ్రీనివాసరావు, ఎంఎస్‌డీ ప్రసాద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

71 లీటర్ల మద్యం స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 2 : సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 71 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ 23,590 రూపాయలు అని ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు స్వాధీనం చేసుకున్న నగదు 10,85,610 రూపాయలు అని తెలిపారు.

మామపై యాసిడ్ దాడి..అల్లుడి అరెస్టు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 2 : మామపై యాసిడ్ పోసి హత్య చేసిన అల్లుడిని జంగారెడ్డిగూడెం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులకు వివరాలు వెల్లడించారు. లక్కవరం గ్రామా నికి చెందిన ప్రగడ నాగేశ్వరరావు (63) పెద్ద కుమార్తె కృష్ణవేణికి, రంగిశెట్టి రమేష్‌కు సుమారు 30 సంవత్సరాల క్రితం వివాహం చేశాడు. మద్యానికి బానిసైన రమేష్ తరచూ కృష్ణవేణితో గొడవపడతుండటంతో సంవత్సరం క్రితం కృష్ణవేణి పుట్టిల్లు లక్కవరం వచ్చేసిందన్నారు. భార్య కృష్ణవేణిని కాపురానికి రమ్మని ఎన్నిసార్లు పిలిచినా ఆమె వెళ్లలేదు. భార్య కాపురానికి రాకపోవడానికి కారణం తన మామ నాగేశ్వరరావు అనే భావించి కోపం పెంచుకున్న రమేష్ మార్చి 31వ తేదీ ఆదివారం రాత్రి యాసిడ్‌తో దాడి చేసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఏప్రిల్ 1న మృతిచెందాడు. ఈ ఘటనపై లక్కవరం ఎస్ఐ టి.సుధీర్ కేసు నమోదు చేశారు. సీఐ రాజేష్ నేతృత్వంలో గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని పుట్లగట్లగూడెం నీలాలమ్మ గుడి సమీపంలో నిందితుడి ఆచూకీ సంబంధించి సమాచారం రావడంతో మంగళవారం సాయంత్రం రమేష్‌ను అరెస్టు చేశారన్నారు. నిందితుడుని బుధవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. సీఐ రాజేష్, ఎస్ఐలు సుధీర్, జయబాబులతో పాటు హెచ్‌సీలు రాజేంద్రప్రసాద్, కె.శ్రీనివాసరావు, పీసీలు నరేష్, సత్యనారాయణ, మణికుమార్, ప్రకాష్‌లకు రివార్డులకు సిఫార్సు చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

2-04-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	241	235	239.95
జంగారెడ్డిగూడెం-1	241	235	239.77
జంగారెడ్డిగూడెం-2	241	235	239.51
కొయ్యలగూడెం	241	235	239.95
గోపాలపురం	241	235	238.78

అడుగంటిన గోదావరి

తగ్గిపోయిన నీటి మట్టం
పంపింగ్ స్కీములకు అందని జలాలు
ఆందోళనలో రైతాంగం



పట్టిసీమ వద్ద తేలిన ఇసుక తిన్నెలు



కడమ్మ ఎత్తిపోతల పథకం వద్ద అడుగంటిన గోదావరి

పోలవరం, ఏప్రిల్ 2 : గోదావరిలో జలాలు అడుగంటాయి. ఇసుక తిన్నెలు పైకి తేలాయి. పోలవరం నుంచి పట్టిసీమ వరకూ నీటిమట్టం పూర్తిస్థాయిలో తగ్గి కడమ్మ ఎత్తిపోతల పథకం, పట్టిసీమ ఎత్తిపోతల పథకం, సత్యసాయి మంచి నీటి పథకం, గూటాల పంపింగ్ స్కీంలకు తగినంత నీరందక పంపింగ్ స్కీం నిర్వహణ నిలిచే పరిస్థితులు నెలకొన్నాయి. పోలవరం పంచాయతీ పరిధిలో యడ్లగూడెం వద్ద ఉన్న కడమ్మ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ఆయకట్టులో సుమారు ఆరు వందల ఎకరాలకు పైగా నీరందేది. నీటిమట్టం తగినంత లేకపోవడం వల్ల పంట చివరి తడులకు సాగునీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆయకట్టు పరిధిలో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మరో నెల రోజులు తడులు అందితే పంటలు గట్టెక్కుతాయని లేకపోతే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టుకున్న రైతులు నష్టపోయే పరిస్థితులు ఎదురవుతాయని అధికారులు స్పందించి నీటి తడులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీటి కరువుకి ప్రధాన కారణాలివే..

ప్రతీ ఏటా పోలవరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల సక్రమంగా జరిగేది. ఈ ఏడాది వర్షాలు ఆశించినంత లేకపోవడం వల్ల పోలవరం ప్రాజెక్టు స్పిల్వే వద్ద ఎగువన 25 మీటర్లకు నీటిమట్టం పడిపోయింది. స్పిల్వే దిగువన 13 మీటర్లకు మాత్రమే ఉండడం, స్పిల్వే గేట్లు అన్నీ పూర్తిస్థాయిలో మూసివేసి స్పిల్వే దిగువన ఉన్న 10 స్లూయిజ్‌లలో కేవలం 3 స్లూయిజ్‌ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తుండడం వల్ల పోలవరం , పట్టిసీమ, ప్రాంతాల్లో నదీ నీటిమట్టం 11.50 మీటర్లకు పడిపోయింది. దీని వల్ల కడమ్మ ఎత్తిపోతల పథకం పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకం వద్ద నీటిమట్టం తగ్గి పంపింగ్ స్కీంలు పనిచేయడానికి అవకాశాలు లేకుండా పోయాయి. గూటాల పంపింగ్ స్కీం వద్ద నీటిమట్టం ఆశించిన స్థాయిలో ఉండడం వలన ఆ పంపింగ్ స్కీం పరిధిలో 2400 ఎకరాలకు నీటి ఎద్దడి లేదు. ప్రస్తుతం నీటి ఎద్దడితో బాధపడుతున్న రైతుల సాగునీటి కష్టాలు పోవాలంటే సీలేరు నుంచి జలాల విడుదల చేయాలని , ధవళేశ్వరం బ్యారేజీ వద్ద తూర్పు పశ్చిమ డెల్టాలకు నీటి పంపిణీ క్రమబద్ధీరిస్తే సరిపోతుందని రైతులు చెబుతున్నారు.

నీటి నిల్వలు తక్కువుగా ఉన్నాయి
గోదావరి హెడ్ వర్క్స్ డీఈ రమేశ్

ఈ ఏడాది వర్షాలు లేకపోవడం వల్ల నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 12.27 మీటర్లు మాత్రమే నమోదైంది. గత ఏడాది ఇదే సీజనులో 13 మీటర్లకు పైబడి ఉండడం వల్ల నీటి ఎద్దడి లేదు. గత ఏడాది ఉభయ గోదావరి డెల్టాలకు 6,300 క్యూసెక్కుల సాగు జలాలు అందించాం. ఈ ఏడాది 5,900 క్యూసెక్కుల సాగు జలాలు మాత్రమే అందించగలిగాం. రెండవ పంటకు మాత్రం 9 లక్షల ఎకరాలకు సాగునీటి ఎద్దడి లేకుండా చేయగలిగామని సీలేరు జలాలు విడుదల చేస్తే నీటిమట్టం పెరిగి సాగునీటి ఎద్దడి ఉండదని తెలిపారు.

హస్తవాసి



కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా విడుదల
సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాకు చింతలపూడి
పాత కొత్తతరం కలబోసి అవకాశాలు
వైసీపీ నుంచి చేరిన వారికి ప్రత్యేక ఛాన్స్
దెందులూరు స్థానంపై కాంగ్రెస్‌లో అసంతృప్తి
టిక్కెట్ నిరాకరించడంతో ఆశావహులు
చౌదరి పార్టీకి రాజీనామా
షర్మిల దిష్టిబొమ్మ దహనం చేసిన అనుచరులు
ఇంకా తేలని ఎంపీ సీట్లు

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వచ్చే ఎన్నికల్లో పోటీచేసే అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను మంగళవారం కాంగ్రెస్ ప్రకటించింది. దీర్ఘకాలికంగా కాంగ్రెస్‌ను అంటిపెట్టుకుని ఉన్నవారికి, వైసీపీని వీడి ఈ మధ్యనే కాంగ్రెస్‌లో చేరిన వారికి అసెంబ్లీ టిక్కెట్లు లభించాయి. పీసీసీ చీఫ్ షర్మిల ఈ మేరకు జాబితాను ప్రకటించారు. దీర్ఘకాలంగా పార్టీని నమ్ముకుని ఉన్నవారికి అవకాశమిచ్చారు. అలాగే కొత్త జిల్లాలకు నాయకత్వ బాధ్యతలు చేపట్టిన వారికి కూడా ఛాన్స్ ఇచ్చారు.



దెందులూరులో వైఎస్ షర్మిల దిష్టి బొమ్మ దహనం చేస్తున్న చౌదరి అనుచరులు

పాత, కొత్త ముఖాలతో జాబితా

కాంగ్రెస్‌కు జవజీవాలు ఇవ్వాలనే సంకల్పంతో పార్టీ తరఫున వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయడంలో పీసీసీ జాగ్రత్తలు పాటించింది. పాత, కొత్త తరాల మధ్య సమన్వయంతో పాటు కాస్తంత లోపాలు లేకుండానే జాబితాను విడుదల చేసినట్లు కొంత మంది భావిస్తున్నా అదే సమయంలో ఈ మధ్యనే వైసీపీకి రాజీనామా చేసి పార్టీలో చేరిన వారికి కూడా అసెంబ్లీ అభ్యర్థి జాబితాలో వారికి చోటు ఇవ్వడం పట్ల కొంత ఆశ్చర్యం వ్యక్తమైంది. ఏలూరు లోక్‌సభ స్థానంలో ఆరు అసెంబ్లీ స్థానాలకు నరసాపురం లోక్‌సభ స్థానంలో ఆరు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఏలూరు, ఆచంట అసెంబ్లీ స్థానాల నుంచి అభ్యర్థులను ఎవరినీ ప్రకటించలేదు. కమ్యూనిస్టులతో ఎన్నికల పొత్తు కారణంగా ఈ రెండు స్థానాలను పెండింగ్‌లో పెట్టినట్లు భావిస్తున్నారు.

చింతలపూడి నియోజకవర్గం నుంచి రెండోసారి పోటీచేసేందుకు కాస్త ఉత్సాహం చూపిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాను వైసీపీ పక్కన పెట్టింది. ఆయనకు ఛాన్స్‌లేదని మూడువారాల క్రితమే తేల్చి చెప్పింది. దీంతో వైసీపీ పట్ల తీవ్ర అసంతృప్తి ఆగ్రహంతో ఉన్న ఆయనను పార్టీలో చేర్చు కునేందుకు టీడీపీ ఒకవైపు, మరోవైపు కాంగ్రెస్ పోటీపడ్డాయి. ఇదే తరుణంలో ఆయన ఈ మధ్యనే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఎదుట కాంగ్రెస్‌లో చేరారు. పట్టుమని వారం తిరగకముందే ఎమ్మెల్యే ఎలీజాకు చింతలపూడి అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి దిగగా కాంగ్రెస్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో చింతలపూడి నియోజకవర్గంలోని ఓట్ల చీలిక అత్యధికంగానే ఉంటుందని భావిస్తున్నారు. విభజిత పశ్చిమగోదావరి జిల్లాకు కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మర్నీడి శేఖర్(బాబ్జి)కి తాడేపల్లిగూడెం నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించారు. పార్టీకి దీర్ఘకాలికంగా విధేయుడిగా, నమ్మకస్తుడిగా ఉన్న పాతపాటి హరికుమార్‌రాజుకు ఉంగుటూరు నియోజక వర్గం సీటు దక్కింది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ హరికుమార్‌రాజు ఇదేస్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పట్లో ఆయనకు మిగతా నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థుల కంటే రికార్డు స్థాయిలో ఓట్లు దక్కడం హరికుమార్ రాజుకు ప్రాముఖ్యత దక్కింది. దెందులూరు నుంచి ఆలపాటి నరసింహమూర్తి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డీవీఆర్‌కే చౌదరి మధ్య పోటీ జరిగినా చివరకు నరసింహమూర్తి అభ్యర్థిత్వం పట్లే కాంగ్రెస్ మొగ్గు చూపింది. పెదవేగి మండలం ముండూరుకు చెందిన నరసింహమూర్తికి అవకాశం ఇచ్చి తనను పక్కన పెట్టడంపై చౌదరి తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. కాంగ్రెస్‌కు రాజీ నామా చేస్తున్నట్లు ప్రకటించారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల దిష్టిబొమ్మను ఆయన అనుచరులు దహనం చేశారు. పార్టీని నమ్ముకుని ఉన్నందుకు జరిగిన న్యాయం ఇదేనా అంటూ జాబితాపై చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం నుంచి దువ్వెల సృజనకు కాంగ్రెస్ టిక్కెట్ ఇచ్చింది. ఇంతకు ముందే సృజన టీడీపీ, వైసీపీలో కూడా కొనసాగారు. నూజివీడు నియోజకవర్గంలో చాలాకాలం నుంచి కాంగ్రెస్‌నే వెన్నంటి ఉంటున్న కృష్ణమరీదుకు అసెంబ్లీకి పోటీ చేసే ఛాన్స్ దక్కింది. ఈ నియోజకవర్గంలో కృష్ణ పలువురికి సుపరిచితుడు కూడా. కైకలూరు నుంచి బొడ్డు నోబుల్‌ని కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించారు. ఈ మధ్యనే జరిగిన కాంగ్రెస్ సర్వసభ్య సమావేశంలో నోబుల్ వైసీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుత పరిస్థితిని పరిగణలోకి తీసుకుని మూడు రోజులు వ్యవధిలోనే నోబుల్‌కి కాంగ్రెస్ టిక్కెట్ దక్కడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. పార్టీలో సీనియర్లుగా ఉన్న అనేకమందికి కూడా ఈసారి అసెంబ్లీకి పోటీ చేసేందుకు వీలుగా పలువురు అభ్యర్థిత్వాన్ని పీసీసీ ఖరారు ప్రకటించింది. ఈ జాబితాలో పాలకొల్లు నుంచి కొలుకులూరి అర్జున్‌రావు భీమవరం నుంచి అంకెం సీతారామ్, తణుకు నుంచి కడలి రామా రావును అభ్యర్థిత్వాలను ప్రకటించారు. వీరంతా కాంగ్రెస్‌లో దీర్ఘకాలి కంగా నాయకత్వం వహిస్తున్నారు. పార్టీ వ్యవహారాలను చక్కపెడుతూ వచ్చారు. నరసాపురం నుంచి తానూరి ఉదయభాస్కర్ కృష్ణప్రసాద్‌ను కూడా జాబి తాలో చేర్చారు. మొత్తంమీద కాంగ్రెస్ విడుదల చేసిన తొలి జాబితాలో పాత, కొత్త తరాల కలయికతో పాటు ఈ మధ్యనే పార్టీలో చేరిన టిక్కెట్లు దక్కటం కాంగ్రెస్ మార్పుకు నిదర్శనంగా మిగిలింది.

ఆచంట, ఏలూరు సంగతి ఏంటి ?

ఏలూరు, ఆచంట అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ పెండింగ్‌లో పెట్టింది. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోని పోలవరం నియోజకవర్గాన్ని తమకే కేటాయించాల్సిందిగా సీపీఐ ఇప్పటికే కాంగ్రెస్‌ను కోరింది. వామపక్షాలతో కాంగ్రెస్ ఎన్నికల పొత్తుకు దిగింది. ఈ అవగాహనలో భాగంగానే సీపీఐ పోలవరం కోరుకున్నా ఆ స్థానం నుంచి సృజనను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించారు. ఆ స్థానానికి బదులుగా ఏలూరు అసెంబ్లీ స్థానాన్ని వామపక్షాలకు కేటాయించినట్లు భావిస్తున్నారు.ఈ స్థానం నుంచి పార్టీ సీనియర్ నాయకుడు బండి వెంకటేశ్వరరావును రంగంలోకి దింపాలని ఇప్పటికే సీపీఐ ఏకాభిప్రాయానికి వచ్చింది. సోమవారం ఈ మేరకు జిల్లా కార్యవర్గ సమావేశమై తీర్మానం కూడా చేసింది. ఏలూరులో స్థిరపరుచితుడైన బండి వెంకటేశ్వరరావు రంగంలోకి దిగితే మెరుగైన ఓట్లశాతం దక్కగలదని సీపీఐ భావిస్తోంది. ఇదిలా ఉండగా ఆచంట అసెంబ్లీ స్థానాన్ని పెండింగ్‌లో పెట్టారు. ఈ స్థానం నుంచి ఇంతకు ముందు పలుమార్లు సీపీఎం పోటీ చేసిన దాఖలాలు ఉన్నాయి. ఈసారి సీపీఎంకు ఆ స్థానాన్ని కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంకోవైపు నరసాపురం, ఏలూరు లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరినీ ఇంకా ఖరారు చేయలేదు. ఈ రెండు స్థానాలను పెండింగ్‌లోనే ఉంచారు.

ప్రకటించిన అభ్యర్థులు



హరికుమార్‌రాజు నరసింహమూర్తి ఉన్నమట్ల ఎలీజా కృష్ణ మరీదు

ఉంగుటూరు : పాతపాటి హరికుమార్‌రాజు
దెందులూరు : ఆలపాటి నరసింహమూర్తి
పోలవరం : దువ్వెల సృజన
చింతలపూడి : ఉన్నమట్ల ఎలీజా
నూజివీడు : కృష్ణమరీదు
కైకలూరు : బొడ్డు నోబుల్
పాలకొల్లు : కొలకలూరి అర్జున్‌రావు
నరసాపురం : కానూరి కృష్ణప్రసాద్ (బుజ్జి)
భీమవరం : అంకెం సీతారామ్
ఉండి : వెంకట గోపాలకృష్ణంరాజు
తణుకు : కడలి రామారావు
తాడేపల్లిగూడెం : మన్నెడి శేఖర్



బొడ్డు నోబుల్



అర్జున్‌రావు



కానూరి కృష్ణప్రసాద్ (బుజ్జి)



సీతారాం, గోపాలకృష్ణం రాజు, రామారావు, శేఖర్

5 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

గణపవరం, ఏప్రిల్ 2: గణపవరం మండల గ్రామాల్లో ఈనెల 5 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం గణపవరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన రబీ ధాన్యం కొనుగోలుపై అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్నారు. మండలంలో 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. రైతులంతా ఈ కేంద్రాలను ఉపయోగించుకుని మద్దతు ధర పొందాలన్నారు. బుధవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గోనెసంచులు అందుబాటులో ఉంటాయన్నారు. మండల వ్యవసాయాధికారి వైపీఎస్ ప్రసాద్, తహసీల్దార్ వై.రాంబాబు, ఎంఎల్‌వో దాసు, వీఆర్వోలు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం..చెట్టు పడి విరిగిన విద్యుత్ స్తంభం



పెనుమంట్ర, ఏప్రిల్ 2 : పెనుమంట్ర మండలం పాల మూరు వ్యవసాయ పరపతి సంఘం భవనం సమీపంలో చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో దగ్గరలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఆ సమయంలో అటువైపు వచ్చేవారు గమనించడంతో తృటిలో ప్రమాదం తప్పింది. లేకపోతే పాఠశాలకు వెళ్లి వచ్చే ప్రధాన మార్గం ఇదే కావడంతో పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. స్తంభం పడిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. విద్యుత్ అధికారులు వెంటనే అక్కడకు చేరి వైర్లు తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.


త్వరలో కైకలూరులో పవన్ బహిరంగ సభ

కైకలూరు, ఏప్రిల్ 2: ఎన్నికల ప్రచారంలో భాగంగా కైకలూరులో జనసేన అధినేత పవన్ కల్యాణ్ బహిరంగ సభ ఉంటుందని కైకలూరు బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ మంగళ వారం రాత్రి తెలిపారు. పిఠాపురం నియోజకవర్గం లో పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కైకలూరు నియోజక వర్గ ఎన్నికల పరిస్థితులపై సుదీర్ఘ చర్చలు జరిపినట్లు కామినేని తెలిపారు. త్వరలో ఎన్నికల బహిరంగసభ నిర్వహిస్తామని అందుకు పవన్‌కల్యాణ్ సుముఖత చూపారని, త్వరలోనే తేదీని ప్రకటించనున్నట్లు తెలిపారు.

కోడిపందేలపై దాడి ..ఐదుగురి అరెస్టు

ఆకివీడు, ఏప్రిల్ 2: అయి-భీమవరంలో కోడి పందాలు నిర్వహిస్తున్న వారిపై మంగళవారం పోలీసులు దాడిచేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.4,500 , 2 కోడి పుంజులు, 2 కోడి కత్తులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

అమ్మో ! బంగారం..



పసిడి ధర పరుగులు
ఆల్‌టైం రికార్డులు దాటుతూ..
పది గ్రాముల బిస్కెట్ ధర 71,000

నరసాపురం, ఏప్రిల్ 2: పసిడి ధర పరుగులు పెడుతోంది. నెల రోజుల నుంచి ఎక్కడా ఆగడం లేదు. ఆల్‌టైం రికార్డులను చెరిపేస్తూ దూసుకు పోతోంది. మంగళవారం గ్రాము బిస్కెట్ బంగారం రూ.7,100 పలికింది. కాసు (ఎనిమిది గ్రాములు) ధర అయితే రూ.56,800 చేరింది. ఆర్నమెంట్ బంగారం గ్రాము రూ.6,570 ఉంది. కాసు అయితే రూ.52,560

ధర పెరుగుదలకు అనేక కారణాలు

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థల పతనం, అమెరికా ఫెడరల్ బ్యాంకు వడ్డీ రేట్లను మరోసారి తగ్గిస్తుందన్న వాదనలు, ఇటు అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరల ప్రభావం కూడా పసిడిపై పడింది. మరోవైపు మనదేశంలో ఎన్నికల నేపథ్యంలో కొనుగోళ్లు భారీగా పడిపోయాయి. వీటి న్నంటికి తోడు స్టాక్ మార్కెట్‌ల్లో కూడా తీవ్ర ఒడిదుడుకులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో మదుపుదారులు పసిడిపై పెట్టుబడులు పెట్టేం దుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ కారణంగానే ధరలు పెరుగు తున్నాయని బులియన్ వర్గాలు పేర్కొంటున్నాయి. ధర ఇలాగే పెరుగుతూ ఉంటూ ఈ ఏడాది చివరికి గ్రాము రూ.8 వేలు చేరినా ఆశ్చర్యపోనవసరం లేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

దుకాణాలు వెలవెల

రాష్ట్రంలో పసిడి మార్కెట్‌కు పశ్చిమ పెట్టింది పేరు. జిల్లాలోని నరసా పురం, భీమవరం, తణుకు, టీపీగూడెం ప్రాంతాల్లో ఎక్కువ జ్యూయలరీ షాపులు ఉన్నాయి. వీటిలో నరసాపురం మార్కెట్‌లోనూ రోజుకు రూ.5 కోట్లు పైనే వ్యాపారం జరుగుతుంది. సీజన్ అయితే రెట్టింపు ఉంటుంది. ఇక్కడ 150కుపైగా దుకాణాలు ఉన్నాయి. తరువాత స్థానం భీమవరానిదే. కార్పొరేట్ బులియన్ షోరూలన్నీ ఇక్కడే ఉన్నాయి. నెల రోజుల నుంచి ధర పెరుగుతూ ఉండటం వల్ల ఆప్రభావం మార్కెట్‌పై పడింది. ఈకారణంగా పసిడి దుకాణాలు వెలవెల బోతున్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ అయినప్పటికీ కొనేందుకు ఎవరూ సాహసించడం లేదు.

అంతర్జాతీయ పరిణామాలే కారణం



పసిడి ధర పెరుగుదలకు అంతర్జాతీయ పరిణామాలే కారణం. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ కుంటుపడింది. ఫెడరల్ బ్యాంకు వడ్డీ రేట్లు తగ్గించవచ్చన్న అనుమానాలతో చాలామంది మదుపుదారులు బంగారంపై పెట్టుబడులు పెడుతున్నారు.ఇవికాకుండా ఇటీవల రష్యాలో జరిగిన కాల్పుల సంఘటన కూడా ఒక కారణం.

- అజిత్‌కుమార్ జైన్, జిల్లా బులియన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

మూడేళ్లలో రెట్టింపు అయింది



కొవిడ్ తరువాత పసిడి ధర ఎక్కడా దిగి రావడం లేదు. 2019లో గ్రాము రూ.3,500 ఉండేది. నేడు రెట్టింపు అయింది. కేవలం నాలుగేళ్ళల్లో ఈ స్థాయిలో పెరుగుతుందని ఎవరూ ఊహించలేదు. ఎప్పటికప్పుడు తగ్గితే కొందామని ఎదురుచూశాం. అంచనాల తలక్రిందులు చేస్తూ బంగారం పెరిగిపోతుంది. ప్రస్తుతం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు పసిడి ధర అందనంత ఎత్తుకు వెళ్లిపోయింది

- సుధా అన్నపూర్ణ, గృహిణి, నరసాపురం



ఎండిన వరిచేలో సైకిల్, మోటార్ సైకిల్ నడిపి నిరసన తెలిపిన రైతులు

సాగు నీరు అందించండి : రైతుల ధర్నా

ఏలూరు రూరల్, ఏప్రిల్ 2: వరి సాగుకు నీరందించాలని ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు మంగళవారం ధర్నా చేపట్టారు. రూరల్ మండలం మల్కాపురంలో నీరు లేక ఎండిన వరి చేలో రైతులు మోటార్‌సైకిళ్ళు నడిపి నిరసన తెలిపారు. ఎండిన వరి దుబ్బులతో రైతులు, కౌలు రైతులు ధర్నా చేశారు. నీటి పారుదలశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే పంటలు ఎండిపోయాయని, ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నెలరోజులుగా తాగు నీరు అందక పంట ఎండిపోతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించారు. కళ్ల ఎదుటే పంట ఎండిపోవడంతో ఆత్మహత్యలే శరణ్యమని కన్నీళ్లు పెట్టుకుంటున్నా పట్టించుకునే దిక్కులేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న మల్కాపురంలో సాగునీరు అందక పంటలు ఎండుతున్నా కలెక్టర్, వ్యవసాయశాఖ, నీటిపారుదలశాఖ అధికారులు దృష్టిసారించకపోవడం సరికాదన్నారు. ధర్నాలో గుర్రాల శోభన్‌బాబు, ఆదాడ దుర్గారావు, జి.ఏడుకొండలు, లావేటి గోవిందు,శివన్నారాయణ, కె.అమ్మినాయుడు, పి.రాంబాబు, లంకా పండు, ఎన్.అప్పారావు, కె.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు లేక గొంతెండుతోంది



మున్సిపల్ కార్యాలయం వద్ద బిందెలతో ధర్నా

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 2: కుమ్మరిరేవు తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకులు బీ.సోమయ్య, జే.గోపి డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మంగళవారం ఖాళీ బిందెలతో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. వేసవి ఆరంభంలోనే తాగునీటి సమస్య ఎదురైందని, నెల రోజుల నుంచి మున్సిపల్ కుళాయిల్లో కలుషిత నీరు వస్తుందన్నారు. కుమ్మరిరేవు ప్రాంతంలో 200 కుటుంబాలు నీరు లేక దాహంతో అలమటిస్తున్నాయన్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ వెంకటకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఏసుబాబు, కళావతి, అప్పలనర్సమ్మ, సావిత్రి, బేబీ పాల్గొన్నారు.

కలెక్టర్ కుమార్తెకు ప్రి ప్రైమరీ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్



సర్టిఫికెట్ అందుకున్న కుమార్తెతో కలెక్టర్

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 : సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ ప్రీ ప్రైమరీ (యూకేజీ/పీపీ-2) బాలల గ్రాడ్యుయేషన్ డే మంగళవారం జరిగింది. 143 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కలెక్టర్ కుమార్తె రాశ్మి సహస్ర అన్వితకు ప్రిన్సిపాల్ సాయి కుమారి శంకర్, విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ కొడాలి వెంకటసుబ్బారావు తదితరులు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు. తమ కుమార్తె సర్టిఫికెట్ అందుకుంటున్న వేడుకలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, సతీమణి మానస, స్కూలు కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, డైరెక్టర్ రాజకళ శ్రీధరి, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

అధిక మార్కులు సాధిస్తే ప్రోత్సాహకాలు : రత్నప్రసాద్



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 2: వార్షిక పరీక్షల్లో అధిక మార్కులు పొందిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని జడ్జి రత్న ప్రసాద్ మంగళవారం సందర్శించారు. వసతి గృహంలో వసతులు, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. శుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. మంచి ఆహారం బాలురు ఆరోగ్యం, చదువు, క్రమశిక్షణకు సహాయ పడుతుందన్నారు. కార్యక్రమంలో వసతి గృహం సూపరింటెండెంట్ శ్రీవల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణహిత వాహనం ఆవిష్కరణ



త్రిచక్ర వాహనంతో పాలిటెక్నిక్ విద్యార్థులు

పెదపాడు, ఏప్రిల్ 2: పర్యావరణ, కాలుష్యరహిత వాహనాన్ని వాహనాన్ని తయారు చేయడం ద్వారా విద్యార్థులు వారిలోని ప్రతిభను చాటారని వట్లూరులోని సీఆర్‌రెడ్డి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అక్కినేని శివకుమార్ తెలిపారు. రెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న డీఈసీఈ విద్యార్థులు నేటి అవసరాలను, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని గంటకు సుమారుగా 25 కిలోమీటర్ల వేగంతో 500 కేజీల బరువును తీసుకెళ్లగల హైబ్రీడ్ త్రిచక్ర వాహనాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ శివకుమార్ మాట్లాడుతూ వాహనానికి కావలసిన 48 ఓల్టు బ్యాటరీ, సోలార్ ప్యానల్స్ మోటారు, కంట్రోలర్, ఇతర పరికరాలను కొనుగోలు చేసి ఈ వాహనాన్ని తయారుచేశారని, మరిన్ని ఆవిష్కరణల దిశగా ముందుకెళ్లాలని విద్యార్థి బృందాన్ని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 2: ద్వారకా తిరుమల దత్తత క్షేత్రమైన శనివారపుపేట చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పాంచాహ్నిక దీక్షతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు, అనంతరం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించారు. బుధవారం అంకురార్పణం, ధ్వజారోహణం, 4న ఎదుర్కోలు ఉత్సవం, 5న స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ ప్రధానార్చకులు ఐగ్రీవాచార్యులు తెలిపారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



సీతారాముల విగ్రహాలు

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 2: శనివారపుపేట హైస్కూల్ రోడ్డు గంగానమ్మ గుడివద్ద సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. దారిపొడవునా భక్తులు ప్రతిష్ఠామూర్తులను స్థానికులు దర్శించుకున్నారు. ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా బుధవారం గణపతిపూజ, ధ్వజారోహణ, నవగ్రహ పూజ, 4న నిత్యపూజ, 5న సీతారామలక్ష్మణ హనుమ విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందని, సీతారామాలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సామూహిక అనఘాష్టమి వ్రతాలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 2. దొండపాడు దత్తనాథ క్షేత్రం వద్ద మంగళవారం సామూహిక అనఘాష్టమి వ్రతాలను జరిపించారు. ప్రధాన అర్చకులు రామకృష్ణ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనఘాలక్ష్మీ సమేత దత్తాత్రేస్వామి పీఠం ఏర్పాటుచేసి వ్రతాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలవరంలో నగరేశ్వరస్వామి ఊరేగింపు



నగరేశ్వరస్వామి ఊరేగింపులో భక్తులు

పోలవరం, ఏప్రిల్ 2: పోలవరం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నగరేశ్వరస్వామి లింగ ప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద పండితులు పైడిపల్లి ఫణికుమార్ శర్మ మాట్లాడుతూ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని నేతృత్వంలో బుధవారం, గురువారం లింగ ప్రతిష్ఠ పూజలు పూజలు జరుగుతాయన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.



ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయాలని జంగారెడ్డిగూడెం, దెందులూరు, పోలవరం, కొయ్యలగూడెం ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇస్తున్న తెలుగుదేశం పార్టీ నేతలు

ఇంటింటికి వెళ్లి పింఛన్లు ఇవ్వాలి

అధికారులకు తెలుగుదేశం పార్టీ నేతల విజ్ఞప్తి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 2: వృద్ధులు, దివ్యంగులు, వితంతు పింఛన్లు ప్రభుత్వ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందించాలని టీడీపీ, జనసేన పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాలో పలుచోట్ల మంగళవారం అధికారులను కలసి వినతిపత్రాలు అందజేశారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో టీడీపీ పట్టణ కమిటీ, మండల పరిషత్ కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రాలను అందజేశారు. వైసీపీ కుట్రపూరితంగా పెన్షన్ సొమ్ము పక్కదారి పట్టించిందన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు ఇతర సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు ఇంటి వద్దనే పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. దాసరి శ్యామ్ చంద్రశేషు, రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ, పెనుమర్తి రామ్‌కుమార్, రాజాన సత్యనారాయణ, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, వలవల తాతాజీ, చింతల నాని, కోనేటి చంటి, నంబూరి రామచంద్రరాజు, తూటికుంట రాము, గుమ్మడి ప్రసాద్, తూటికుంట దుర్గారావు, చెరుకూరి శ్రీధర్, చేను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: పింఛన్లను సచివాలయ సిబ్బందితో లబ్ధిదారులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో ఎంపీడీవో జి.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. పాదం ప్రసాద్, పోతుల శ్రీను, కొత్తపల్లి నాగేశ్వరరావు, మజ్జి అప్పారావు, మాగంటి రాము, ఇల్లా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: పింఛన్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము అందజేయాలని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ డిమాండ్‌చేశారు. జుజ్జూరి బాబ్జి, కొయ్యగూర స్వామినాథం, కరుటూరి బాలస్వామి, ఖాన్‌వజీర్, తదితరులు పాల్గొన్నారు

● లింగపాలెం: ప్రభుత్వ సిబ్బంది ద్వారా పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్ద అందజేయాలని రంగాపురం సర్పంచ్ ముసునూరి రాము డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం పింఛన్ల సొమ్మును పక్కదారి పట్టించిందని ఆరోపించారు. సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లు అందజేయాలన్నారు. ఖజానా ఖాళీ చేసిన జగన్ ప్రభుత్వం అవ్వా తాతలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పలువురు తెలుగుదేశంపార్టీ నేతలు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటా పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓకు వినతిపత్రం ఇచ్చారు. ఎన్నికల కమిషన్ నియామవళి ప్రకారం వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయడం కుదరదు కాబట్టి సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు ఇంటింటా పంపిణీ చేయాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్, జ్యేష్ఠ రామకృష్ణ, మేఘలాదేవి, బెల్లాని శ్రీను, కేసిబాబు, కొత్త రమా తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: అవ్వా, తాతలకు పింఛన్లను వారికి ఇంటికే తీసుకెళ్లి అందజేయాలని టీడీపీ నాయకులు మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. పింఛన్ లబ్ధిదారులు చాలామంది నడవలేని స్థితిలో ఉంటారని, కొంతమంది మంచానికే పరిమితమై ఉన్నారని, ఇంకొంతమంది దివ్యాంగులు ఉన్నారని, వారికి ఇంటికే తీసుకెళ్ళి పింఛను అందించాలని నాయకులు కోరారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం అనుయాయులైన కాంట్రాక్టర్లకు పింఛను సొమ్మును దోచిపెట్టి, ఇప్పుడు పింఛన్ల పంపిణీకి టీడీపీ, ఎన్నికల సంఘం కారణంగానే పింఛన్లను పంపిణీ చేయలేకపోతున్నామని నెపాన్ని వేయాలని చూస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్ అన్నారు. పింఛనుదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వారివద్దకే వెళ్ళి పింఛన్లను అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో ఫోటోగ్రాఫర్‌గా వైసీపీకి చెందిన వ్యక్తిని తీసుకున్నారని, అతడిని తప్పించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి కేవీ.జాన్సన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తాతా సత్యనారాయణ, అన్నపనేని సురేష్, కుర్మా రమేష్, నాగు తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: పింఛన్లను సచివాలయం లేదా పంచాయతీ ఉద్యోగుల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి అందించాలని టీడీపీ మండల అధ్యక్షుడు మిల్లుబాబు, వెంకటేశ్వరావు, నేతలు కోరారు. ఎంపీటీవో సుమలతకు టీడీపీ నేతలు కలపాల చంద్రశేఖర్, మహేష్‌యాదవ్, కొండయ్యచౌదరి, తదితరులు వినతిపత్రం అందజేశారు. వైసీపీ కుట్రపూరితంగా పింఛన్ల సొమ్ము పక్కదారి పట్టించిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంపంగి వేణుగోపాల తిలక్, కొలుసు నాని, దాసే శ్రీను, తదితరులు ఉన్నారు



ఏలూరు ప్రజాగళం కార్యక్రమంలో బడేటి చంటి

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల ప్రచారం

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 2: సైకో జగన్ పాలనలో రాష్ట్రాన్ని రాతి యుగానికి తీసుకెళ్లాడని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైతేనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. ఏలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బడేటి చంటి మంగళవారం 13, 14 డివిజన్లలో ప్రజాగళం కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి మరడాని రంగారావు, జనసేన ఏలూరు ఇన్‌చార్జ్ రెడ్డి అప్పల నాయుడు పాల్గొన్నారు. చంటి మాట్లాడుతూ ఏపీని స్వర్ణయుగం వైపు నడిపించే రథసారధి చంద్రబాబు నాయుడేనన్నారు. వైసీపీ అరాచక పాలన అంతం చేయడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయన్నారు. అప్పల నాయుడు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల వారు తీవ్రంగా నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే బీసీలకు రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. పెద్దిబోయిన శివప్రసాద్, కాశీనరేష్, గౌరీశంకర్, సాంబశివరావు, లక్ష్మణరావు, పాల్గొన్నారు. అనంతరం 24వ డివిజన్‌లో బడేటి చంటి పాదయాత్ర చేశారు.

బీసీలకు టీడీపీతోనే న్యాయం : రోషన్ కుమార్

జంగారెడ్డిగూడెం: బీసీలకు టీడీపీతోనే న్యాయం జరుగుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ సమావేశం చిట్టిబోయిన రామలింగేశ్వరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ బీసీలకు 50ఏళ్లకే రూ.4వేలు పెన్షన్, రక్షణ చట్టం, ఐదేళ్లలో రూ.1.50లక్షల కోట్ల నిధులు కేటాయింపు, 34 శాతానికి రిజర్వేషన్లు తదితర అంశాలను హామీలుగా మేనిఫెస్టోలో పెట్టారని, టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. జనసేన కన్వీనర్ మేకా ఈశ్వరయ్య, నంబూరి రాజు, రాజాన పండు, చిత్రోజు తాతాజీ, తూటికుంట రాము, మండవ లక్ష్మణరావు, చేను ప్రసాద్, తెలగారపు జ్యోతి, జనసేన అధ్యక్షుడు పీర్లు, కోనేటి చంటి, గెడా సుబ్రహ్మణ్యం, ఊదర సుబ్బారావు, కంచర్ల గణేష్, బేతాల మురళి, నాయకులు, కార్యకర్తలు, బీసీలు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని 17, 18, 19 వార్డుల్లో ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మహిళలు ఆయనకు హారతులు పట్టి స్వాగతం పలికారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి : చిర్రి బాలరాజు

టి.నరసాపురం: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కూటమి పోలవరం నియోజకవర్గం అభ్యర్థి చిర్రి బాలరాజు తెలిపారు. అప్పలరాజుగూడెం, బండివారిగూడెం, మక్కినవారిగూడెం, మర్రిగూడెంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ నాయకులను, కార్యకర్తలను కలసి మద్దతు కోరారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. పోలవరం నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అడపా నాగరాజు, ఆదిత్య, నవీన్, పెంటారావు, మాండ్రు రాంబాబు, ఇమామ్, జట్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



టి.నరసాపురం మండలంలో మినీ మేనిఫెస్టో వివరిస్తున్న చిర్రి బాలరాజు

ఎన్‌డీఏ కూటమి విజయానికి కృషి : రాష్ట్రీయ లోక్‌జన్‌శక్తి



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఏలూరు రూరల్: రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి తమవంతు కృషి చేస్తామని రాష్ట్రీయ లోక్ జన్‌శక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చాగంటి పాటి జాన్‌వెస్లీ అన్నారు. ఏలూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎల్‌జేపీ బీజేపీ మిత్రపక్షంగా కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో ఎన్నికల పొత్తుల్లో భాగంగా ఎన్‌డీఏ కూటమిలోని అభ్యర్థుల విజయానికి తమ పార్టీ తరపున ప్రతి జిల్లాలో విస్తృతప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 5న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ను కూడా కలవనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో రాష్ట్రీయ లోక్ జన్‌శక్తి పార్టీ బలోపేతానికి కమిటీలు వేశామన్నారు. సమావేశంలో ఆకుర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంపు లక్ష్యం : స్వీప్ నోడల్ అధికారి



ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం

ఏలూరు: ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపు లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టినట్లు స్వీప్ నోడల్ అధికారి, డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. బస్టాండ్ ప్రాంగణంలో కీర్తన కల్చరల్ సొసైటీ కళాజాత బృందం ప్రయాణికులకు ఓటుహక్కు వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఎగువ శ్రేణి, యువ ఓటర్లు పోలింగ్‌లో భాగస్వామ్యం కావడానికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. 92శాతం ఓటింగ్ నమోదుకు కలెక్టర్ ప్రణాళికను ఆమోదించారని దానిలో భాగంగా జిల్లాలో అన్ని ప్రాంతాల్లో స్వీప్ కార్యక్రమాలు చేపడుతూ ఓటర్లను చైతన్య పరుస్తున్నామని శ్రీనివాసవిశ్వనాథ్ తెలిపారు.

18 ఏళ్ల వారు ఓటు నమోదు చేసుకోండి : సూర్యతేజ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో సూర్యతేజ

టి.నరసాపురం, ఏప్రిల్ 2: ఓటు హక్కు పొందడానికి గడువు ఉందని, 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. 85 ఏళ్ల వయసు పైబడి నడవలేని, లేవలేని వారికి, దివ్యాంగులకు ఇంటి వద్ద నుండే ఓటు వేయడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రం వద్ద ఏఈఆర్‌ఓ, బీఎల్‌ఓల ఫోన్ నెంబర్లు ఉండాలని, వివాదాస్పద పోలింగ్ కేంద్రాలు గుర్తించాలని, ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఖాజావలి

ఉంగుటూరు, ఏప్రిల్ 2: ఎన్నికల విధుల్లో ఎవరు నిర్లక్ష్యం వహించినా క్రిమినల్ కేసులు ఎదుర్కోవలసి వస్తుందని రిటర్నింగ్ అధికారి ఖాజావలి హెచ్చరించారు. నియోజకవర్గ స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, బీఎల్వోలు, వీఆర్వోలు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తహసీల్దార్లు వివరించారు. తహసీల్దార్లు కె.వెంకట శివయ్య, వరహాలరావు, కె.పోసిబాబు, వై.రాంబాబు, సీఐలు ఎంవీ.సుభాష్, బీబీ.రవికుమార్, ఎంపీడీవోలు స్వర్ణలత, శర్మ, సూర్యనారాయణ, శివరామకృష్ణ, సెక్టార్ అధికారులు, బూత్ లెవెల్ అధికారులు, ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాల కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సమన్వయంతో ఆరోగ్య సేవలందించాలి

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, అంటువ్యాధుల నిర్మూలనలో క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో సేవలందించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. పవర్‌పేట, ఎంఆర్‌సీ కాలనీ, ఆముదాల అప్పలస్వామి కాలనీ వీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో వడదెబ్బ, అంటువ్యాధుల కేసులు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయని, క్షేత్రస్థాయి సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు, నివారణచర్యలపై అవగాహన కలిగించాలన్నారు. వైద్యాధికారులు గౌతమ్, సిబ్బంది సీతామహాలక్ష్మి, శ్రీనివాసరావు, ఝాన్సీ పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన సదస్సు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 2:దొండపాడు ఉమ ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఎలీష అంధుల భవనంలో ఆటిజం అవగాహన సదస్సు నిర్వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ వైకల్యం, గర్భవతిగా ఉన్న సమయంలో, ప్రసవ సమయంలో సంభవిస్తుందని మేనరికం వివాహాలు చేసుకోవడం కూడా ఆటిజం సంభవిస్తుందన్నారు. జాగ్రత్తలు తెలియజేశారు. సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి, డీడీఆర్‌సీ సిబ్బంది, అంధత్వం గల పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం



సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీ

జీలుగుమిల్లి, మార్చి 2: ఎన్నికల తనిఖీల్లో భాగంగా తాటియాకులగూడెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. నగదు, ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే సామగ్రి, మద్యం తరలిపోకుండా తెలంగాణ నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని మంగళవారం అధికారులు పరిశీలించారు. ఎస్సై వి.చంద్రశేఖర్, ఎస్ఈబీ ఎస్సై శేఖర్‌బాబు, ఎర్ సిబ్బంది, ఆర్టీవో, కమర్షియల్ టాక్స్, రెవెన్యు అధికారులు తనిఖీల్లో ఉన్నారు.

కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ

పెదపాడు, ఏప్రిల్ 2: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ ఎటువంటి రవాణా జరగకుండా చర్యలు చేపట్టినట్లుగా ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. జాతీయ రహదారిపై కలపర్రు టోల్‌గేట్ వద్ద సిబ్బందితో కలసి మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని, నిబంధనలను అతిక్రమించి ఇబ్బందులకు గురికాకూడదని వాహనదారులకు సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



కొత్తూరు చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

కామవరపుకోట, ఏప్రిల్ 2: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం సీఐ పి. రాజేష్ తెలిపారు. తడికలపూడి పోలీసులతో కొత్తూరు నాలుగురోడ్ల కూడలి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ మార్గంలో ప్రతి వాహనాన్ని పరిశీలిస్తున్నారు. ఎన్నికల అధికారులు ఎండి మొహిద్దీన్, జీవీఆర్ రమేష్, శేషగిరి, ఎస్ఐ జయబాబు, ఏఎస్ఐ వీరాస్వామి, గణేష్, తదితరులు ఉన్నారు.

ఏలూరు రూరల్, అర్బన్ హెచ్‌ఎంల సమావేశం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 2: రూరల్, అర్బన్ మండలాల ప్రధానోపాధ్యాయుల సమావేశం మంగళవారం జరిగింది. ఎస్ఎస్ఏ ఏపీసీ పి.సోమశేఖర్ పాఠశాలలో ఐఎఫ్‌టి ప్యానల్, స్మార్ట్ టీవీల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ట్యాబ్‌ల నిర్వహణపై చర్చించారు. ఎస్ఏ-2 పరీక్షల నిర్వహణ, మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై అవగాహన కల్పించారు. ఎంఈవో రంగయ్య మాట్లాడుతూ రివాల్వింగ్ ఫండ్‌తో పాఠశాలల అభివృద్ధిని ఏ విధంగా ఖర్చుచేయాలో వివరించారు. దీక్షాయాప్‌లో ఉపాధ్యాయులు నమోదు చేయాల్సిన అంశాలు, వచ్చే విద్యాసంవత్సరానికి ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. ఎంపీడీవో బండి ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 2: వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలను ఏర్పాటు, పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఏఐకేఎంఎస్ నాయకుడు కారం రాఘవ, న్యూడెమోక్రసీ అభ్యర్థి ఎస్.రామ్మోహన్ డిమాండ్ చేశారు. అలివేరు పంచాయతీ లంకపాకల గ్రామంలో మంగళవారం చింతల కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వ విధానాల వల్ల గిట్టుబాటు ధరలు దక్కడం లేదన్నారు. ఉద్యమ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. సర్పంచ్ కారం లక్ష్మి, కొవ్వాసి గోవిందరాజు, టి.బాబురావు, కె.పోతురెడ్డి, వి.భారతి, పట్ల చిన్నన్న, బి.వినోద్ పాల్గొన్నారు.

నవోదయకు మెట్టగూడెం విద్యార్థి ఎంపిక



టి.నరసాపురం, ఏప్రిల్ 2: మెట్టగూడెం గ్రామానికి చెందిన ఐదో తరగతి విద్యార్థి ఓసూరి రామకృష్ణ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్లు విద్యార్థి తండ్రి నాగరాజు మంగళవారం తెలిపారు. మెట్టగూడెం పాఠశాలలో చదువుతున్న రామకృష్ణ ఇటీవల నవోదయలో 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష రాశాడు. రామకృష్ణ నవోదయకు ఎంపిక కావడానికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను గ్రామస్థులు అభినందించారు.

కూటమి అభ్యర్థి జనసేన నేతలతో పనిచేయాలి

దెందులూరు, మార్చి 2: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జనసేన నేతలందరిని కలుపుకుని పనిచేయాలని పలువురు కోరుతున్నారు. నియోజకవర్గంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటశాల వెంకటలక్ష్మి ఒంటెత్తు పోకడతో వ్యవహరిస్తున్నారని కొఠారు ఆదిశేషు, కలపాల ప్రేమ్ కుమార్, ఆర్ జోసెఫ్ తంబి,మట్ట రంగబాబు ఆరోపించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఘంటశాల వెంకటలక్ష్మి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కార్యక్రమాల బాధ్యురాలని, ఆమె నియోజకవర్గ ఇన్‌చార్జి అంటూ ఉమ్మడి అభ్యర్థి ప్రచారం చేయడం సరికాదన్నారు. జనసేన నేతలు, కార్యకర్తలను ఉమ్మడి అభ్యర్థి, వెంకటలక్ష్మి పట్టించుకోవడం లేదన్నారు. దెందులూరులో కూటమి అభ్యర్థి గెలవాలని తాము కోరుకుంటున్నామని, తమ నేతలను దూరం పెడితే నష్టపోతారన్నారు.

ఆసుపత్రికి బయల్దేరిన మహిళ అదృశ్యం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 2: ఆసుపత్రిలో బంధువులను చూసి వస్తానని వెళ్లిన మహిళ అదృశ్యమైందని ఆమె భర్త త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొండపాడుకు చెందిన రత్నాల ప్రియాంక (24)కు భర్త సత్యనారాయణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతనెల 31న భార్యాభర్తలు ఇద్దరూ ఆటో ఎక్కి ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద దిగారు. సత్యనారాయణ ఆర్ఆర్ పేటలో పని ఉందని వెళ్ళగా, ప్రియాంక ఎస్ఆర్‌పేటలోని ఆసుపత్రిలో ఉన్న బంధువులను చూసి వస్తానని వెళ్ళింది. అప్పటి నుంచి ఆమె ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భర్త సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

పెదవేగి, ఏప్రిల్ 2: ముత్తనవీడు గ్రామానికి చెందిన కుమారపు గౌరీశంకర్ ద్విచక్రవాహనం నాలుగురోజుల కిందట అపహరించారు. వెతికినా కనిపించక పోవడంతో మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

కూచింపూడిలో నత్తా కృపావరం ద్విచక్రవాహనాన్ని అదే గ్రామానికి చెందిన శ్రీను దగ్ధం చేశాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **లింగపాలెం :** గ్రామపంచాయతీలలో మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎంపీడీవో రాంబాబు ఆధ్వర్యంలో అన్ని సచివాలయాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వేసవికాలం దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.
- **పెదపాడు :** అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నప్రసాదాన్ని మంగళవారం అందజేశారు. మంగళవారం పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.
- **ఉంగుటూరు :** ఉప్పాకపాడులో ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్చేందుకు వారి తల్లిదండ్రులను ఒప్పించారు. హెచ్‌ఎం నక్కా ఆనందరావు, ఉపాధ్యాయుడు అల్లు శ్రీను పాల్గొన్నారు.
- ఉంగుటూరు జనసేన పార్టీ కార్యాలయంలో నిడమర్రు మండలం గుణపర్రు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నుంచి జనసేనలో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు సాదరంగా ఆహ్వానం పలికి కండువాలు కప్పారు.
- **భీమడోలు :** దివ్యాంగుల అభివృద్ధికి దాతల వితరణ గొప్పదని పలువురు వక్తలు కొనియాడారు. గుండుగొలను శ్రీ విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 55 మంది దివ్యాంగులకు సన్నబియ్యం, పండ్లు, పోషకాహార పదార్థాలను దాట్ల సూర్యనారాయణరాజు జ్ఞాపకార్థం ఆయన అల్లుడు ఇందుకూరి సత్యనారాయణరాజు పంపిణీ చేశారు.
- భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నేతలు, స్థానిక వైసీపీ శ్రేణులు సుమారు 200 మంది జనసేన పార్టీలో చేరనున్నారు. పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో వగ్వాల విజయవెంకట భాస్కర్, మామిళ్ళపల్లి కాళీహనుమాన్‌బాబు, చిట్టి దుర్గా శంకరరావు, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు బోడా సన్‌సోన్, సుధారాణి, జి విజయ గెగారెన్, బోడా దేవవరమ్మతో వైసీపీ నుంచి సుమారు 200 మంది కార్యకర్తలు, జనసేన పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు బుధవారం గుండుగొలను గ్రామంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వగ్వాల విజయ భాస్కర్ తెలిపారు.


చిత్తపూరులో మాట్లాడుతున్న నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి


బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆనంద్ సూర్య


భుజబలపట్నంలో మాట్లాడుతున్న ముదునూరి సీతారామరాజు


చాట్రాయిలో బీసీ డిక్లరేషన్‌పై ఇంటింటి ప్రచారం

చింతలపూడిపై నిలదీయండి

» నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి » కూటమి అభ్యర్థులను గెలిపించాలని విస్తృత ప్రచారాలు

చాట్రాయి, ఏప్రిల్ 2: టీడీపీ హయాంలో 70 శాతం పనులు జరిగిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు పూర్తి చేయలేదని నూజివీడు ఎమ్మెల్యే పార్థసారథిని రైతులు, ప్రజలు నిలదీయాలని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి కోరారు. మంగళవారం మండలంలోని చిత్తపూరు, సోమవరం గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు, మర్లపాలెంలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో నాగార్జున సాగర్ నుంచి సాగునీరు వచ్చే అవకాశాలు తగ్గిపోవటంతో చంద్రబాబు ముందుచూపుతో గోదావరి వరద జలాలతో మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూ. 4900 కోట్లు నిధులు కేటాయించి సుమారు రూ.3500 కోట్లు ఖర్చు చేసి 70 శాతం పనులు పూర్తి చేయగా వైసీపీ ఆ పథకాన్ని మూలపడేయటం దుర్మార్గమన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు పునః ప్రారంభించి సత్వరం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. జగన్ సర్కార్ ప్రజలకు పంచిన దానికంటే వారి నుంచి మద్యం, పన్నుల రూపంలో దోచుకున్నదే ఎక్కువ అన్నారు. పిట్టలవారిగూడెం ఎత్తిపోతల పూర్తిచేయాలని, సబ్ స్టేషన్ మంజూరు చేయాలని, డ్రైనేజీలు పూర్తి చేయాలని ప్రజలు కోరారు. టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, నాయకులు దామెర చిట్టిబాబు, కొత్తపల్లి రామదాసు, బేతిన వీరరాఘవయ్య, యర్రోజు రాంప్రసాద్, వెల్ది రాజారావు, ముల్లంగి చిట్టిబాబు, వెల్ది అప్పారావు తదితరులు పాల్గొన్నారు. సోమవరం గ్రామంలో వైసీపీ నాయకులు కలవల వెంకటేశ్వరరావు, సుబ్బారావు ఆధ్వర్యంలో పలువురు పార్థసారథి సమక్షంలో టీడీపీలో చేరారు.

ఎమ్మెల్యే ప్రతాప్‌కు సమస్యలు పట్టవు

నూజివీడు: ఐదేళ్లుగా కళ్ళు మూసుకుని ఎన్నికల కోడ్‌కు రెండు రోజుల ముందు నూజివీడులో ఎమ్మెల్యే ప్రతాప అప్పారావు శంకుస్థాపనలు చేయటం నూజివీడు ప్రజలను మరోసారి మోసం చేయటమేనని నూజివీడు టీడీపీ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం నూజివీడులో తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఏడు నెలల క్రితం సీఎం జగన్ నూజివీడు వచ్చి రూ.16 కోట్లను అభివృద్ధి పనులకు అంగీకారం తెలిపితే వాటిని వెంటనే తెచ్చుకోలేని అసమర్థత ఎమ్మెల్యేదన్నారు. చెరువు భూములకు పట్టాలు ఇవ్వరు అని ఎమ్మెల్యే ప్రతాప్ చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. కేబినెట్ ఆమోదం తీసుకుని ఆ చెరువు భూములకు సైతం పట్టాలు ఇవ్వవచ్చనే విషయం సుదీర్ఘకాలం శాసనసభ్యుడిగా పనిచేసిన ప్రతాప్‌కి తెలియకపోవడం ఆయన విషయ పరిజ్ఞానానికి నిదర్శనమన్నారు. సీఎం జగన్, ఎమ్మెల్యే ప్రతాప్ హామీలను ఎంత మేరకు అమలు చేశారో చెప్పాలన్నారు. టిడ్కో ఇళ్లల్లో అవినీతి జరిగిందని చెబుతున్న ప్రతాప్ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఎందుకు వాటిని నిరూపించలేకపోయారని ప్రశ్నించారు. టిడ్కో ఇళ్ళ విషయంలో బ్యాంకులు, ప్రభుత్వం పాత్ర నిలదీస్తూ త్వరలో తాను లబ్ధిదారులతో కలసి బ్యాంకుల వద్ద ధర్నా చేయనున్నట్లు స్పష్టం చేశారు. అసెంబ్లీలో తాను, ప్రతాప్ ఒకే బెంచ్‌లో కూర్చొనేవారమన్నారు. ఏనాడూ ప్రతాప్ నూజివీడు సమస్యలపై గానీ, చింతలపూడి ఎత్తిపోతల పథకం గురించి గాని శాసనసభలో ప్రస్తావించలేదని పార్థసారథి ఆరోపించారు. కృష్ణావాటర్ విషయంలో సాంకేతిక సమస్య ఎదురైతే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునే విషయంలో ప్రతాప్ నిర్లక్ష్యంగా వ్యవహరించటం ప్రజా సమస్యల పట్ల ఆయనకున్న శ్రద్ధను చాటుతోందన్నారు. పెనమలూరులో తాను చేసిన అభివృద్ధిని, ప్రతాప్ పరిశీలించుకోవచ్చన్నారు.

అసత్యాలు ప్రచారం వైసీపీకి అలవాటే..

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. ఇప్పుడు పెన్షన్‌లు సైతం ఇవ్వలేని దుస్థితికి రాష్ట్రం దిగజారిందన్నారు. జగన్ వైఫల్యాల వల్ల పెన్షన్లు ఇవ్వలేకపోతోందని అయితే చంద్రబాబు వల్లే ఇవ్వలేకపోతున్నామని వైసీపీ అబద్ధాలకు తెరతీసిందన్నారు. ప్రజలను ఎల్లప్పుడూ మోసం చేయటం సాధ్యం కాదన్నారు. ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని పార్థసారథి కోరారు.

మరోసారి జగన్ వస్తే రైతులంతా వలసే..

కైకలూరు: మరోసారి జగన్మోహన్ రెడ్డికి అవకాశమిస్తే రైతులంతా వలస వెళ్లిపోవాల్సివస్తుందని మాజీ జడ్పీటీసీ ముదునూరి సీతారామరాజు అన్నారు. మంగళవారం భుజబలపట్నంలో కామినేని ఆత్మీయ సమావేశాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అధ్యక్షతన నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తలు బైకులు, కార్ల ర్యాలీ నిర్వహించారు. అసెంబ్లీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో సీతారామరాజు మాట్లాడుతూ కైకలూరు ప్రాంతం ప్రధానంగా ఆక్వాపరిశ్రమపై ఆధారపడి ఉందని, మరోసారి జగన్మోహన రెడ్డి అధికారంలోకి వస్తే ఆక్వా పరిశ్రమ కు నీటి మాటలా ఉన్నా తాగేందుకు కూడా నీరు ఉండదని రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. ఆక్వా పరిశ్రమ దెబ్బతింటే ఈ ప్రాంత ప్రజలంతా పొరుగు రాష్ట్రాలకు వలస పోవాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. కూటమి నాయకుడు పోసిన పాపారావుగౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అవినీతి, అరాచకాలు పెచ్చరిల్లిపోయాయని అన్ని సామాజిక వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. కలిదిండి మండలంలో చేపలచెరువులు తవ్వుకునేందుకు వైసీపీ నాయకులు రూ.2 కోట్లు లంచం డిమాండ్ చేశారని బేరమాడితే ఎట్టకేలకు రూ.75 లక్షలు తీసుకున్నారన్నారు. దానికి ప్రత్యక్షసాక్షిగా తానేనన్నారు. ఇలాంటి అరాచకపాలన చేసే కుటుంబపాలనను సాగనంపాలని అందుకే ఆ పార్టీని వీడి కూటమిలో చేరానన్నారు. గ్రామ ప్రముఖులు సయ్యపురాజు వెంకట కృష్ణంరాజు, మాజీ జడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మీ, టీడీపీ రాష్ట్ర నాయకులు బలే ఏసురాజు, పీజెఎస్ మాల్యాద్రి, పూల రామచంద్రరావు, మాజీ సర్పంచ్ గుజ్జల రామలక్ష్మి, మహిళా నాయకురాలు తెంటు వెంకటరమణ, గంగుల శ్రీదేవి, తోట లక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్లు తాడినాడ బాబు, వల్లభనేని శ్రీనివాస చౌదరి, టీడీపీ కలిదిండి మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, బీజేపీ నాయకులు డాక్టర్ సీఎల్ వెంకట్రావు, కాంట్రాక్టర్ కృష్ణంరాజు, పేరిచర్ల ప్రసాదరాజు, కొత్తూరి వాసురాజు, దండు రాము తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులంతా కూటమి అభ్యర్థుల్ని గెలిపించాలి

బ్రాహ్మణులంతా ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించుకోవచ్చని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆనంద్‌సూర్య అన్నారు. మంగళవారం కైకలూరులో నియోజకవర్గ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశాన్ని విభిన్న ప్రతిభావంతుల విభాగం, ఐటీడీపీ నాయకుడు వేంపాటి ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఆనంద్‌సూర్య ముఖ్య అతిథిగా మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా చంద్రబాబు అనేక పథకాలను అందించారని వేద పాఠశాలలో విద్యార్థులకు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనదేనన్నారు. ఎమ్మెల్యేగా కామినేని శ్రీనివాస్‌ను, ఎంపీగా పుట్టా మహేష్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. బ్రాహ్మణులంతా కూటమికి ఓట్లు వేయడమే కాకుండా ఇతర కులస్థులను చైతన్యం చేసి వారు కూడా కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేలా చూడాలన్నారు. వేంపాటి ప్రవీణ్ మాట్లాడుతూ కూటమిని గెలిపించాలని, బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం తన సొంత ఆస్తులతో కమ్యూనిటీ హాలు, కల్యాణ మండప నిర్మాణం చేపడతానన్నారు. బ్రాహ్మణ సంఘం నాయకులు గుడిపాటి రామ కృష్ణ, మద్దూరి సూర్యనారాయణ, ఉప్పులూరి ప్రసాద్, సత్యనారాయణా చార్యులు, కళా మురళీకృష్ణ, కల్పన, విజయలక్ష్మి, నండూరి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు సీఎం కావాలి

రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నా చంద్రబాబు సీఎం అయితేనే సాధ్యపడుతుందని మాజీ సర్పంచ్‌లు నర్సిపల్లి అప్పారావు, తెంటు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కైకలూరు 2వ వార్డులో కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలు ఓటర్లకు వివరించారు. జనసేన నాయకుడు మైగాపుల రామాంజనేయులు, జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, టీడీపీ నాయకుడు వీరాబత్తిన సుధా, తెలుగు మహిళ మండల కార్యదర్శి శీలం కృష్ణవేణి, జనసేన వీరమహిళలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు లబ్ధి

ముసునూరు: చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందని పార్టీ గ్రామ అధ్యక్షుడు వేంపాటి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం లోపూడిలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, కరపత్రాలను నాయకులు అందజేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఈ పథకాలను సమర్థవం తంగా అమలు చేస్తారని వివరించారు. జగన్‌రెడ్డి మాయమాటలకు మోస పోకుండా, కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేలా ఓటు వేయాలని కోరారు. టీడీపీ నాయకులు చలమాల వెంకటేశ్వరరావు, నక్కా చెన్నారావు, కాటేపల్లి కేశవరావు, డోలా రాంబాబు, పంజుగల వెంకయ్య, పేరం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల ఇంటింటి ప్రచారం

చాట్రాయి: టీడీపీని అధికారంలోకి తెచ్చుకుంటే బీసీలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏలూరు జిల్లా నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజు, జిల్లా నాయకుడు కొప్పాక సత్యనారాయణ, రాయవరపు సీతారాములు అన్నారు. మంగళవారం మండలంలో పలు గ్రామాల్లో నాయీ బ్రాహ్మణుల ఇళ్లకు వెళ్ళి బీసీ డిక్లరేషన్‌పై అవగాహన కల్పించారు. నూజివీడు అసెంబ్లీ, ఏలూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థులు పార్థసారథి, పుట్టా మహేష్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. రాయవరపు పల్లారావు, ఎల్లంకి ఉమామహేశ్వరరావు, నరం సత్యనారాయణ, ఓగిరాల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో తెలుగు యువత ప్రచారం

ముదినేపల్లి: ఏలూరు లోక్‌సభ, కైకలూరు అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ నాయకులు కోరారు. మంగళవారం అల్లూరు దళితవాడలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తరపున పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నీలిపల్లి సన్యాసిరావు, పత్తి శివశంకర్, దాసరి శ్రీను, కులమట్ల రాము, బర్ల జోష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


లోపూడిలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు


అల్లూరులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


భుజబలపట్నంలో బీజేపీ, టీడీపీ, జనసేన బైక్ ర్యాలీ


కైకలూరులో కూటమి నాయకుల ప్రచారం

కైకలూరు కాంగ్రెస్ అభ్యర్థిగా బొడ్డు నోబుల్



కైకలూరు, ఏప్రిల్ 2: కైకలూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొడ్డు నోబుల్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం ప్రకటించారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో బ్లాక్-1 అధ్యక్షుడిగా, అనంతరం వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తనను చిన్నచూపు చూశారని మనస్థాపం చెంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎస్సీ సామాజిక వర్గంలో బలమైన నాయకుడిగా గుర్తింపు పొందిన నోబుల్‌కి టిక్కెటు ఇవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నూజివీడు అభ్యర్థిగా మరీదు కృష్ణ



నూజివీడు, ఏప్రిల్ 2: నూజివీడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మరీదు కృష్ణను ఎంపిక చేస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. దివంగత మాజీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి పాలడుగు వెంకట్రావు శిష్యుల్లో ఒకడిగా గుర్తింపు పొందిన మరీదు కృష్ణ 2001 నుంచి 2006వరకు నూజివీడు ఎంపీపీగా పనిచేశారు. ఆయన స్వస్థలం నూజివీడు మండలం మీర్జాపురం. ఎంపీపీగా ఉన్న సమయంలో మరీదు కృష్ణ నూజివీడు మండలంలో బడుగు, బలహీనవర్గాలకు పథకాలను అందించడంతో నియోజకవర్గంలో ఆయన సుపరిచితులు.

వలంటీర్ల ఫోన్ల అప్పగింత

ముదినేపల్లి, ఏప్రిల్ 2 : ప్రభుత్వ ఆదేశాల మేరకు ముదినేపల్లి మండలంలోని గ్రామ వలంటీర్ల సెల్‌ఫోన్లు, డివైజ్‌లు అధికారులకు అప్పగించారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలోని 335 మంది వలంటీర్ల నుంచి తీసుకున్న ఫోన్లు, డివైజ్‌లను మంగళవారం జిల్లా అధికారులకు అందజేసినట్లు ఎంపీడీవో గంగాధరరావు తెలిపారు. పెన్షన్ల పంపిణీ చేసే సిబ్బందికి డివైజ్‌లు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలి

కలిదిండి, ఏప్రిల్ 2 : ఓటు హక్కుపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ దశిక వంశీ అన్నారు. మంగళవారం సంతోషపురం, కొండంగి, మట్టగుంట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఓటు హక్కుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఓటర్లు చైతన్యవంతులై నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నూరుశాతం ఓట్లు పోలయ్యే విధంగా యువత నడుం బిగించాలన్నారు. ఓటర్లను ఎవరైన భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో రాజకీయ పార్టీల ఆఫీసులు ఉండకూడదన్నారు. సెక్టార్ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కళాజాతతో ఓటర్లకు అవగాహన

ఆగిరిపల్లి, ఏప్రిల్ 2: ఓటు హక్కు వినియోగంపై ఆగిరిపల్లి పెద్దకొరాయి సెంటర్లో కళాజాత నిర్వహించారు. పంచాయతీ అధికారి డి.శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో 100 శాతం ఓటింగ్ జరగాలనే లక్ష్యంతో కళాజాత నిర్వహించారు. 1950 నెంబర్‌కు డయల్‌చేస్తే ఓటర్ కార్డు పై వివరిస్తారని, సీవిజిల్ యాప్ ద్వారా ఎన్నికల్లో జరిగే అక్రమాలు, దుష్ప్రచారాల పై ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు చేసినవారి పేర్లు గోప్యంగా ఉంచుతారని, మంచివారిని ఎన్నుకోవాలని పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్ అన్నారు.


కైకలూరు ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న తెలుగుయువత


ఎంపీడీవో పద్మావతిదేవికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఇళ్ల వద్దే పింఛను పంపిణీ చేయాలి

కైకలూరు, ఏప్రిల్ 2: సామాజిక పెన్షన్లను పంచాయతీ, సచివాలయ సిబ్బందితో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేయాలని తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు అన్నారు. మంగళవారం కైకలూరు ఎంపీడీవో ఉమామహేశ్వరరావుకు తెలుగుయువత ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామాల్లో సామాజిక పెన్షన్లు పంపిణీ చేసే అవకాశమున్నా ప్రభుత్వం టీడీపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు దావు నాగరాజు, తెలుగుయువత నాయకులు వీరాబత్తిన సుధా, మీగడ శివకృష్ణ, వేగిరెడ్డి సురేష్, లక్కింశెట్టి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: లబ్ధిదారులకు వారి ఇంటికి వెళ్ళి పెన్షన్ సొమ్ము అందజేయాలని కోరుతూ ఎంపీడీఈవో సీహెచ్.పద్మావతిదేవికి టీడీపీ మండల అధ్యక్షుడు దేవినేని డలరాం ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవినేని మాట్లాడుతూ నేటికీ అధికారుల అకౌంటుల్లో పెన్షన్ పడలేదని, నగదు ఎప్పుడు వస్తే అప్పుడే పెన్షన్‌ల పంపిణీ చేపడతామని ఎంపీడీవో చెప్పారని, అసలు డబ్బులు లేకుండా టీడీపీ, ఎన్నికల సంఘం పెన్షన్‌ల పంపిణీ ఆపారని జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు అవాస్తవాలు ప్రచారం చేయడం కుట్రేనని, దీనిని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. అప్పుల ఊబి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే చంద్రబాబు సీఎం అయ్యేలా ప్రజలంతా విజ్ఞతతో ఓటువేయాలని కోరారు. తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ (బాబి), బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను, వలసపల్లి గ్రామపార్టీ అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర, పాకనాటి సీతారామ్‌లు పాల్గొన్నారు.

ముదినేపల్లి: పెన్షన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దే పంపిణీ చేయాలని పీసీసీ సభ్యుడు మంగినేని బాబ్జీ, ముదినేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోళ్ల రాజ్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ వలంటీర్ల ద్వారా పంపిణీ చేయవద్దని ఆంక్షలను విధించిందే తప్ప ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవద్దని చెప్పలేదని, గ్రామ సచివాలయాలు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బందితో ఇళ్ల వద్ద పంపిణీ చేయాలని, పెన్షనర్లను ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు.

వాహనాల్లో తరలిస్తున్న రూ. 4.29 లక్షలు స్వాధీనం

కలిదిండి, ఏప్రిల్ 2 : వాహనాల్లో తరలిస్తున్న 4.29 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు. కలిదిండికి చెందిన గంపా రాజేష్ బుల్లెట్‌పై మంగళవారం రాత్రి రూ.3,59,960లు, కోరుకొల్లుకు చెందిన చావాకుల వెంకట రాజేష్ కారులో రూ.78,500 నగదును తరలిస్తుండగా, మద్వానిగూడెం చెక్ పోస్టు వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ సహకారంతో పట్టుకున్నామన్నారు. ఆధారాలు చూపకపోవటంతో నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

80 మద్యం సీసాలు స్వాధీనం




కైకలూరు, ఏప్రిల్ 2: అక్రమంగా తరలిస్తున్న 80 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కైకలూరు రూరల్ ఎస్సై టి. రామకృష్ణ తెలిపారు. మంగళవారం కైకలూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని శృంగవరప్పాడుకు చెందిన దండి పొట్ల సత్యనారాయణమూర్తి అనే వ్యక్తి 80 మద్యం సీసాలను తీసుకువెళ్తుండగా అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



కలిదిండి, ఏప్రిల్ 2 : పెదపుట్లపూడికి చెందిన వైసీపీ నాయకులు నడకుదిటి గణపతి, నడకుదుటి నారాయణ స్వామి, తిరుమాని పోతురాజు, నడకుదిటి కుమార స్వామి, నడకుదిటి ఆంజనేయులు, పెదసింగు సురేష్, నడకుదిటి అర్జున్‌తోపాటు 50 మంది వైసీపీ కార్యకర్తలు మంగళవారం కలిదిండిలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ అరాచక పాలనతో విసుగు చెందిన వీరంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారన్నారు. డీసీ మాజీ ఛైర్మన్ ఎం.భోగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ బషార్‌తుల్లా, యూనిట్ ఇన్‌చార్జ్ వాతాడి రామకృష్ణ, టీడీపీ నాయకులు దున్న భోగేశ్వరరావు, తట్టుగోళ్ల నాంచారయ్య, అక్కల బోసు, వడుగు గోపాలం, కొక్కిలిగడ్డ వీరాంజనేయులు, సామేరు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కైకలూరులో పవన్ బహిరంగ సభ


పిఠాపురంలో పవన్‌ను కలసిన కామినేని

కైకలూరు, ఏప్రిల్ 2: ఎన్నికల ప్రచారంలో భాగంగా కైకలూరులో జనసేన అధినేత పవన్ కల్యాణ్ బహిరంగ సభ ఉంటుందని కైకలూరు బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ మంగళవారం రాత్రి తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కైకలూరు నియోజక వర్గ ఎన్నికల పరిస్థితులపై సుదీర్ఘ చర్చలు జరిపినట్లు కామినేని తెలిపారు. త్వరలో ఎన్నికల బహిరంగసభ నిర్వహిస్తామని అందుకు పవన్‌కల్యాణ్ సుముఖత చూపారని, త్వరలోనే తేదీని ప్రకటించనున్నట్లు తెలిపారు.

నేడు విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ముసునూరు, ఏప్రిల్ 2: సింహాద్రిపురంలో బుధవారం ఉదయం 9.13 గంటలకు పట్టాభి సీతారామ స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అనంతరం భారీ అన్నదాన జరుగుతుందని, భక్తులు వేలాదిగా పాల్గొనాలని కోరింది.

రేపు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

కైకలూరు, ఏప్రిల్ 2: కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 4న నిర్వహించనున్నట్లు టీడీపీ కైకలూరు మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు కైకలూరు టీడీపీ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బూత్ ఏజెంట్లు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉపాధి పనులు కల్పించాలని వినతి

చాట్రాయి, ఏప్రిల్ 2: చిన్నంపేటలో ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కూలీలు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఆనందం మాట్లాడుతూ ఏప్రిల్ నెల వచ్చినా ఉపాధి పనులు ప్రారంభించకపోవటం వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏడాదిలో ఒక్కో కుటుంబానికి 200 రోజులు పనులు కల్పించటంతో పాటు రోజూ రూ. 600 వేతనం ఇవ్వాలని, పే స్లిప్పులు ఇవ్వాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



కృత్రిమ కాళ్ళ వితరణ

ఆగిరిపల్లి, ఏప్రిల్ 2: అభివృద్ధికి వైకల్యం అడ్డురాకూడదని దీపక్ నెక్స్‌జెన్ ఫుడ్స్ అండ్ ఫీడ్ సంస్థ ఎండీ సుబ్రహ్మణ్యం అన్నారు. తోటపల్లిలో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామ వాసి గోరుముచ్చు శ్యామల, సుందరయ్య కాలనీ వాసి బొకినాల విజయ్‌కుమారి, గన్నవరానికి చెందిన తల్లిబోయిన అంకాలుకు కృత్రిమకాళ్ళు అందజేశారు. అనంతరం హీల్ క్యాంపస్‌లో స్పోర్ట్స్ క్యాంప్ ప్రారంభించారు. దీపక్ సంస్థ డైరెక్టర్లు చైతన్య, వెంకట శేషాద్రి, హీల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై అవగాహన ఉంది: ముద్దరబోయిన

చాట్రాయి, ఏప్రిల్ 2: నూజివీడు నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉన్నదని, తనపై నమ్మకం ఉంచి గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం చాట్రాయి పాత రైస్‌మిల్లు ఆవరణలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

శ్మశానవాటికలో తుప్పల తొలగింపు

ముసునూరు, ఏప్రిల్ 2: ముసునూరు ఎస్సీ కాలనీ శ్మశాన వాటికలో పెరిగిన తుప్పలను మంగళవారం తొలగించారు. ఇటీవల ముసునూరు వచ్చిన ఎమ్మెల్యే ప్రతాప్‌కు శ్మశానవాటిక సమస్యపై మాజీ సర్పంచ్ రేగుల గోపాలకృష్ణ తదితరులు వివరించగా మంగళవారం వాటిని తొలగించారు. దీంతో ఎస్సీ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పెదగొన్నూరులో రంగు మారి కలుషితమైన మంచినీటి చెరువు నీరు

కలుషిత నీరే దిక్కు

రంగుమారిన మంచినీటి చెరువులు

దుర్వాసన రావడంతో పెదగొన్నూరు వాసుల వెతలు

ముదినేపల్లి, ఏప్రిల్ 2: మండలంలోని పెదగొన్నూరు పంచాయతీ పరిధిలో మంచినీటి చెరువులు పూర్తిగా కలుషితమయ్యాయి. చెరువుల్లో నీరు అడుగంటడం, ఉన్న కొద్దిపాటి నీరు రంగుమారి దుర్వాసన వెదజల్లుతోంది. రక్షిత మంచినీటి పథకం ద్వారా కుళాయిల నుంచి వస్తున్న ఈ నీరు తాగలేకపోతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. పెదగొన్నూరుతోపాటు ఆ పంచాయతీ శివారు గ్రామాలైన ఉప్పరగూడెం, విశ్వనాద్రిపాలెం గ్రామాల్లోని చెరువుల్లో కూడా నీరు అడుగంటింది. ఈ నీటిని ఇతర అవసరాలకు వాడుకునేందుకు కూడా ఇబ్బందికరంగానే ఉందని, శరీరంపై దురదలు వస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి దృష్ట్యా కలుషిత నీటినే వాడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని గ్రామస్థులు వాపోతున్నారు. కాల్వలకు నీరు వదలక ముందే చెరువుల్లోని నీటిని బయటికి తోడించి బాగు చేయించాలని కోరుతున్నారు. అలాగే పశువులు చెరువులు కూడా కలుషితం కావడంతో పశువులు ఆ నీటినే తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. కాల్వలకు నీటి విడుదలలో జాప్యం వల్ల చెరువులను నింపటంలో ఆలస్యమవుతోంది. చెరువులను నింపే వరకు ఈ కలుషిత నీరే దిక్కా అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాల్వలకు నీటి విడుదల చేయాలి



కాల్వలకు త్వరగా నీరు విడుదల చేయాలి. చెరువులను నింపకపోతే నీటి ఎద్దడి మరింత జఠిలమవుతుంది. కలుషిత నీటినే వాడుకోవాల్సి వస్తుంది.

-వీరంకి చక్రపాణి, విశ్వనాద్రిపాలెం గ్రామస్థుడు